ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

ఏప్రిల్ 2010
వెల : రూ. 10



నా భారతావని

కర్మభూమి... యోగభూమి... ధన్యభూమి

సురభి

మాతృదేవి ఎంతో సదాచార సంపన్నురాలు. కానీ శ్రీమతి బుల్, కుమారి మెక్‌లౌడ్ అనే ఇద్దరు పాశ్చాత్య మహిళలను చూసినప్పుడు ఆ ఆచారమంతా మటు మాయమైంది. వారిని సాదరంగా ఆహ్వానించడమే కాకుండా, వారితో కూర్చుని భోజనం చేశారు. ఇతరులు ఈ దృశ్యం చూసి నివ్వెరపోవడాన్ని ఆమె ఖాతరు చేయలేదు. వీటన్నింటిని చూసినప్పుడు నేను (సోదరి నివేదిత) అమితాశ్చర్యానికి లోనయ్యాను. భారతదేశంలో నా సేవాకార్యం చక్కగా జరుగుతుందని గట్టి నమ్మకం కుదిరింది. మరేదీ ఇలాంటి నమ్మకాన్ని కలిగించి ఉండదు. ఇది సామాన్యమైన విషయమా ఏమిటి?

ఉన్నత కుటుంబాలకు చెందిన పద్నాలుగు, పదిహేను మంది స్త్రీలు సదా మాతృదేవితో ఉండేవారు. వ్యాజ్యాలు, కలహాలు అంటూ ఇతరులకు విసుగు కలిగించే కోవకు చెందుతారు వీరు. అలాంటి వారిని కూడా తమ అద్భుత సామర్థ్యంతోనూ, సామరస్యంతోనూ ప్రశాంతంగా తమతోపాటు ఉంచుకోగలుగుతున్నారు. ఆమె నిజమైన మహత్త్వానికి ఇంతకన్నా మరేం నిదర్శనం కావాలి?

భారతీయ మహిళకు పరిపూర్ణ ఆదర్శంగా మాతృదేవిని శ్రీరామకృష్ణులు గాంచారనే నాకు అనిపిస్తున్నది. పరిపూర్ణ ఆదర్శమంటే ఆమె పాత తరానికి ముగింపా? లేకపోతే కొత్త తరానికి నాందా? అతి సామాన్యమైన ఒక స్త్రీ పొందదగిన జ్ఞానమూ, మాధుర్యమూ ఆమెలో మిళితమై ఉండడం చూడవచ్చు. ఆమె ఒక పావనమైన మహిళారత్నం. ఆ పావనత్వం లానే ఆమె ఇతరులతో మెలగే తీరూ, ఆమె మనోవైశాల్యం అద్భుతమైనవి. అతి క్లిష్టమైన ప్రశ్నలకు కూడా ఠక్కున ఆమె నుండి విశదమైన జవాబు రావడం చూడవచ్చు. ప్రగాఢమైన ప్రశాంతత యొక్క ఒక అద్భుత ప్రార్థన - మాతృదేవి జీవితం. ❖

(సోదరి నివేదిత స్మృతుల నుంచి)

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 67 సంచిక: 4 ఏప్రిల్ 2010

గాయంతి దేవాః కలగీతికాని ధన్యాస్తు తే భారతభూమిభాగే ।
స్వర్గాపవర్గాస్పద మార్గభూతే భవంతి భూయః పురుషాః సురత్వాత్ ॥

ఓ భారతమాతా! నీ బిడ్డలు ధన్యులు. నిన్ను గూర్చి దేవతలు గానం చేస్తున్నారు. స్వర్గలోకమునకు, మోక్షపదమునకు నీవే సోపానం. ఎంతో సుకృతం చేసుకొంటేనే నీకు బిడ్డలుగా జన్మించే భాగ్యం లభిస్తుంది.

– విష్ణు పురాణం

లోపలి పేజీల్లో...

4 సంపాదకీయం
విలువలున్న విజేతలు కావాలి!

11 దేవీ వైభవం

6 గోరుముద్ద
మార్పు

13 ధీరవాణి
విద్య అంటే ఏమిటి?

7 శ్రీరామకృష్ణ నామంలో అంతరార్థం

14 పరిప్రశ్న

8 ఏకాగ్రత – ధ్యానం



15 ఆధ్యాత్మిక అహంకారం

9 పరమేశ్వరుని పరిరక్షణలో...
మాతృభూమి సేవలో విప్లవ దళం

16 బొమ్మల కథ
సిక్కుల తొలి గురువు – గురునానక్



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'లో సభ్యులుగా చేరి ధనదానం చేయాల్సిందిగా మనవి. సభ్యుల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు / చిరునామా	రూ.
రాజపోషకులు	: శ్రీమతి ఎమ్. రాధాదేవి, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా - 534 202	5,000
రాజపోషకులు	: శ్రీమతి ఎమ్. పి. ఎస్. మాధవి, బాపట్ల, గుంటూరు జిల్లా - 522 101	5,000
పోషకులు	: శ్రీ డి.వి. అవధాని, భీమతంగి, భువనేశ్వర్ - 751 002	1,116
పోషకులు	: డాక్టర్ ఎమ్. స్వప్న శ్రీదేవి, నెల్లూరు.	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

ప్రియ భక్తులారా!

యువతరంలో ఆత్మవిశ్వాసాన్ని నింపే యువనాయక స్వామి వివేకానంద స్ఫూర్తివచనాలతో వెలువడుతున్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకూ, కళాశాలలకూ అందించాలని సంకల్పించాం.

శ్రీరామకృష్ణుల, స్వామి వివేకానందుల సందేశాల ఆవశ్యకతను గురించి సుభాష్ చంద్రబోస్ ఒక సందర్భంలో చెబుతూ, "శీలనిర్మాణానికి రామకృష్ణ - వివేకానంద సాహిత్యం కన్నా ఉన్నతమైన సాహిత్యం వేరొకటి లేదు" అని అన్నారు.

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయడానికి మీ ఆర్థిక సహాయాన్ని కోరుతున్నాం. ఈ పథకం కింద రూ. 1500 మొత్తాన్ని జీవిత చందా (20 సంవత్సరాలకు) కట్టినట్లయితే మీరు సూచించిన, లేదా మేము ఎంపిక చేసిన ఒక పాఠశాల/కళాశాలకు 20 ఏళ్ళ పాటు పత్రికను మీ పేరున పంపుతాం. చందాదారుని పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

మీ చందాను ఎమ్.ఓ. / డి.డి./ చెక్కు రూపంలో Ramakrishna Math, Hyderabad పేరున తీసుకొని, Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029 చిరునామాకు పంపవలెను.

స్వామీజీ ఆదర్శాలకు అనుగుణంగా యువతరాన్ని తీర్చిదిద్దడంలో 'శ్రీరామకృష్ణ ప్రభ' చేపట్టిన ఈ పథకానికి చేయూతనందించగలరని ఆశిస్తున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో
స్వామి జ్ఞానదానంద
అధ్యక్షులు

ముఖచిత్రం : భారతదేశం కర్మభూమి, యోగభూమి, త్యాగభూమి, ధన్యభూమి అని శ్లాఘించారు స్వామి వివేకానంద. అలాంటి భారతదేశ ఘనకీర్తిని స్ఫురింపజేసేలా చిత్రీకరించిన కళాకారుడు మణియన్ సెల్వమ్, చెన్నై. (చెన్నై, శ్రీరామకృష్ణ మఠం సౌజన్యంతో)

ADVERTISEMENT TARIFF

	MULTI COLOUR	B & W
Fourth Cover	Rs.25,000	-
Second Cover	Rs.20,000	-
Third Cover	Rs.20,000	-
Inside Full Page	Rs.15,000	10,000
Inside Half Page	Rs.10,000	5,000

చందా వివరాలు

		ఇండియాలో	విదేశాలలో
విడి ప్రతి	:	రూ. 10	-
ఒక సంవత్సర చందా	:	రూ. 100	$ 25
మూడు సంవత్సరాలకు	:	రూ. 280	$ 55
ఐదు సంవత్సరాలకు	:	రూ. 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	:	రూ. 1500	$ 365

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో **Ramakrishna Math, Hyderabad** అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా : **Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.**

లోపలి పేజీల్లో...



18 త్రికరణశుద్ధి

20 ఓ మహాత్యాగి ఆత్మకథ
(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

22 ప్రాచీన గాథలు : జీవన వికాసం
మానవ జన్మ సార్థకత!

24 యువవాణి
నవతరం సందేహాలకు సమాధానాలు

25 ఆచరణతో ప్రగతి పథం వైపు...

26 గతమెంతో ఘనకీర్తి

28 యువతా! మనోనైర్మల్యాన్ని సాధించు!

31 మహనీయుల జీవితాల్లో మధురఘట్టాలు
సాహస బాలుడు

33 నా జీవితంలో స్వామి వివేకానంద
స్ఫూర్తినిచ్చిన మహావాక్యం!

36 భక్త జయదేవుడు

37 మనస్సుకు ఇవ్వాల్సిన శిక్షణ

38 ఆచార వ్యవహారాలు-అంతరార్థాలు
తులసిని ఎప్పుడు, ఎలా కోయాలి?

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు పైన చిరునామాకు కుడి భాగంలో మీ చందా గడువు ముగిసే నెల వ్రాసి ఉంది. సకాలంలో సొమ్ము చెల్లించి, చందా పొడిగించుకోండి. 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆధ్యాత్మిక వెలుగులు మీ ఇంట నిరంతరాయంగా ప్రసరించేలా సహకరించండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నెంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- పత్రిక ప్రతీ నెల 26వ తేదీన పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపు చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

- సర్క్యులేషన్ మేనేజర్

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు.

- సంపాదకులు

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
Domalguda, Hyderabad - 500 029. Andhra Pradesh
Phone No: 040 - 2766 7799, E-mail : sriramakrishnaprabha@gmail.com

విలువలున్న విజేతలు కావాలి!

నేటి సమాజంలో విజయం సాధించిన వ్యక్తులు చాలా మంది ఉన్నారు. కానీ విలువలతో కూడిన వ్యక్తుల జాబితా మాత్రం వేళ్ళ మీద లెక్కించగలిగిన సంఖ్యకే పరిమితం అయిపోయింది. అందుకే "విజయవంతమైన వ్యక్తిగా ఎదగడం కన్నా, విలువలు గల వ్యక్తిగా మారడం ముఖ్యం. విజయానికి కావలసింది - కేవలం మేధ! కానీ విలువలున్న వ్యక్తిగా మారాలంటే కావలసింది-శీలం" అంటారు ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్. అయితే విలువలున్న వ్యక్తులు ఎక్కడ లభిస్తారు?

ఒకసారి సోక్రటీస్, ఓ అబ్బాయితో 'బాబూ! మంచి ఆపిల్ పండ్లు ఎక్కడ దొరుకుతాయి?' అని అడిగాడు. వెంటనే ఆ అబ్బాయి దగ్గరలో ఉన్న ఒక దుకాణం చూపించాడు. 'మంచి తేనె ఎక్కడ దొరుకుతుంది?' అని సోక్రటీస్, ఆ అబ్బాయిని అడిగాడు. అందుకు ఆ అబ్బాయి మంచి తేనె లభించే దుకాణం చిరునామాను చెప్పాడు. సోక్రటీస్ మళ్ళీ, 'బాబూ! మంచి మనిషి ఎక్కడ లభిస్తాడో చెప్పగలవా?' అని ప్రశ్నించాడు. ఆ అబ్బాయి ఏం సమాధానం చెప్పాలో తెలియక అమాయకంగా చూస్తూ నిలబడిపోయాడు.

మనకు కావలసిన నాణ్యమైన వస్తువుల కోసం ప్రయత్నిస్తే బజారులో లభిస్తాయి. కానీ విలువలతో కూడిన వ్యక్తులు లభిస్తారా? మరి మంచి మనుషుల కోసం ఎక్కడ వెతకాలి?

మన ఇల్లే మార్పునకు నాంది : గ్రీకు తత్త్వవేత్త డయోజెనీస్ (Diogenes) ఒకసారి మిట్టమధ్యాహ్నం చేతిలో ఒక లాంతరు పట్టుకొని, వీధిలో ఏదో వెతకడం ప్రారంభించాడు. ఈ వింత దృశ్యాన్ని చూసిన ఓ పెద్ద మనిషి, 'మిట్టమధ్యాహ్నం లాంతరు పట్టుకుని ఏమిటి వెతుకుతున్నారు?' అని డయోజెనీస్‌ను ఎగతాళి చేశాడు. అందుకు డయోజెనీస్ 'ఒక మంచి మనిషి దొరుకుతాడేమోనని వెతుకుతున్నాను' అని బదులిచ్చాడు.

ఇక్కడ మనం డయోజెనీస్ మాటల్లోని అంతరార్థాన్ని జాగ్రత్తగా గమనించాలి. పట్టపగలు లాంతరు పట్టుకొని వెతికినా మంచి మనిషి కనిపించడం కష్టమనీ, వీధిలో వెతకడం అంటే మంచి మనిషి కోసం ముందు మన ఇంట్లో వెతక్కుండా సమాజంలో వెతకడమనీ దీనిలోని అంతరార్థం. సమాజంలో మానవత్వం ఉన్న మనుష్యుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోందని ఏకరువు పెట్టడం కన్నా, మానవతా విలువలు గల వ్యక్తిగా వికసించడానికి మన కుటుంబమే నాంది కావాలి. అందుకు మన ఇంటినే ఓ వ్యక్తిత్వవికాస కేంద్రంగా రూపుదిద్దాలి.

వ్యక్తిత్వ వికాసానికి రూపకర్తలు: కేవలం వ్యక్తిత్వ వికాస రచనలు చదవడం, వ్యక్తిత్వ వికాస సదస్సుల్లో పాల్గొనడం, వేసవి శిబిరాల్లో శిక్షణ పొందడం వల్ల మాత్రమే వ్యక్తిత్వం వికసించదు. తల్లితండ్రుల శిక్షణలోనే నిజమైన వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుంది. ఎందుకంటే పిల్లలు మొట్టమొదట విని, చూసి నేర్చుకునేది తల్లితండ్రుల నుంచే! కాబట్టి తల్లితండ్రుల ప్రవర్తన పిల్లల వ్యక్తిత్వంపై ఎంతగానో ప్రభావం చూపుతుంది. అందువల్ల తల్లితండ్రులు పిల్లలకు ఏం చెబుతారో తామూ అదే చెయ్యాలి, తాము ఏది చేస్తారో అదే పిల్లలకు చెప్పాలి. అంతేకానీ చెప్పేది ఒకటి, చేసేది వేరొకటి అయితే పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడం అసాధ్యం.

The reason parents no longer lead their children in the right direction is because the parents aren't going that way themselves. - *Kin Hubbard*

మనం ఇంకొకరిని ఏది చెయ్యవద్దని చెబుతామో, ముందుగా అది మనం చేయకుండా ఉండాలి. అందుకు శ్రీరామకృష్ణులు ఓ చక్కని దృష్టాంతం చెప్పారు:

ఒక వైద్యుడు, రోగికి మందు వ్రాసి ఇచ్చి, 'ఇంకో రోజు రా! పథ్యం విషయం అప్పుడు చెబుతాను' అన్నాడు. మరొక రోజు ఆ రోగి వచ్చి వైద్యుణ్ణి సంప్రతించాడు. అప్పుడు వైద్యుడు, ఆ రోగితో, 'ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండు! బెల్లం మాత్రం తినకు' అన్నాడు.

ఆ రోగి వెళ్ళిపోయిన తరువాత అక్కడున్న ఒక వ్యక్తి వైద్యుడితో, 'అవునూ, అతణ్ణి అంత దూరం నుంచి రప్పించి కష్టపెట్టడమెందుకు? ఈ మాట ఆ రోజే చెప్పి ఉండవచ్చు కదా!' అన్నాడు. వైద్యుడు నవ్వుతూ, 'ఆ రోజు ఈ మాట చెప్పి ఉంటే అతడికి నా మాటపై గురి ఏర్పడి ఉండేది కాదు. 'ఇతని గదిలో ఎన్ని బెల్లం జాడీలు ఉన్నాయి! కాస్తయినా ఇతను కచ్చితంగా తింటాడు' అని రోగి అనుకునేవాడు. కానీ ఈ రోజు బెల్లం జాడీలు తీసేశాను కాబట్టి నా మాటపై అతడికి తప్పక గురి కుదురుతుంది' అని అన్నాడు.

చాలా మంది తల్లితండ్రులు, పిల్లలు తమ మాట వినడం లేదని ఫిర్యాదు చేస్తూ ఉంటారు. అందుకు కారణం వారు చెప్పినది ఆచరణలో చూపక పోవడమే!

సానుకూల భావాల బోధన : ప్రస్తుత విద్యావిధానం విలువల్ని పెంపొందించడంలో విఫలమైంది. విద్యార్థుల్లో వ్యతిరేక భావాల్ని పెంచే నేటి మన విద్యావిధానం గురించి స్వామి వివేకానంద ఇలా అన్నారు:

"ప్రస్తుత విద్యావిధానం వ్యక్తిత్వ వికాసానికి ఉపకరించదు. అది పూర్తిగా వ్యక్తిని తిరోగమన మార్గంలో నడుపుతుంది. పిల్లవాడు పాఠశాలకు వెళ్ళిన ప్రారంభ దశలోనే మొదట తన తండ్రి బుద్ధిహీనుడనీ, తాత పిచ్చివాడనీ, ఉపాధ్యాయులందరూ వంచకులనీ, పవిత్ర గ్రంథాలన్నీ అసత్యాలనీ నేర్చుకుంటాడు. పిల్లవాడికి 16 ఏళ్ళు వచ్చేసరికి నిరాశావాదిగా, అచేతనుడిగా, పిరికిపందగా రూపొందుతాడు".

చేసిన పని మంచిదైనప్పటికీ ప్రతికూల భావాలు పిల్లలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయో తెలుసుకోవడానికి ఒక సర్వే జరిగింది. 'ఒక విద్యార్థికి వేయి రూపాయలు ఉన్న పర్సు ఒకటి దొరికింది. ఆ పర్సు ఎవరిదో విచారించి అందజేశాడు. జరిగిన విషయం ఉపాధ్యాయునికి తెలియజేశాడు ఆ విద్యార్థి. అప్పుడు ఉపాధ్యాయుడు తరగతి గదిలో 'దొరికిన పర్సును తిరిగి సదరు వ్యక్తికి అందజేయడం మంచి పనా, కాదా!' అని విద్యార్థులను ప్రశ్నించాడు. అప్పుడు తరగతి గదిలో ఉన్న 50 మంది విద్యార్థుల్లో 45 మంది 'తప్పు' అని వ్యతిరేక భావాన్ని వ్యక్తం చేశారు. రెండో రోజు కూడా ఉపాధ్యాయుడు విద్యార్థుల్ని అదే ప్రశ్న వేయగా 49 మంది 'తప్పు' అని బదులిచ్చారు. ఉపాధ్యాయుడు మళ్ళీ మూడో రోజు అదే ప్రశ్న విద్యార్థుల్ని అడిగాడు. అప్పుడు మొత్తం తరగతి గదిలోని 50 మంది విద్యార్థులూ (పర్సు అందజేసిన విద్యార్థితో సహా) 'తప్పు' అని సమాధానమిచ్చారు.

వ్యతిరేక భావాల్ని తరచూ వినడం వల్ల మంచి మనస్సు ఉన్నవారు కూడా ఎలా మారిపోతారో దీన్ని బట్టి అర్థమవుతోంది. పెద్దల పట్ల వినయవిధేయతల్నీ, ఉపాధ్యాయుల పట్ల గౌరవ భావాన్ని కలిగి ఉండేలా; తాము నిజమని నమ్మిన దానికి ఎలాంటి పరిస్థితుల్లోనైనా కట్టుబడి ఉండేలా మనఃస్థైర్యాన్ని పెంపొందిస్తూ తల్లితండ్రులు పిల్లలకు తగిన శిక్షణనివ్వాలి.

ఇంటినే ఒక వ్యక్తిత్వ వికాస కేంద్రంగా మలచి, తల్లితండ్రులే వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే రూపకర్తలుగా, సానుకూల భావాలను బోధించే ప్రథమ గురువులుగా తమ వంతు పాత్రను పోషించాలి. అప్పుడే పిల్లలు **'విలువలున్న విజేతలు'**గా వికసిస్తారు. ఫలితంగా, సమాజం శాంతి సామరస్యాలతో విరాజిల్లుతుంది. ❖

అమ్మానాన్నలు ఆచరించాల్సినవి...

1. **ఇంట్లో పరిశుభ్రత, ప్రశాంత వాతావరణం నెలకొనేలా శ్రద్ధ తీసుకోవాలి.**
2. **పిల్లల ముందు కోపతాపాలను ప్రదర్శించకుండా, అనవసర కబుర్లు, అబద్ధాలు చెప్పకుండా జాగ్రత్త పడాలి.**
3. **సమయం విలువను వారికి వివరించి, సమయాన్ని సద్వినియోగ పరుచుకోవడానికి దినచర్యను రూపొందించాలి.**
4. **పిల్లలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, వారు చెప్పిన మాటలను ఓర్పుగా విని, సానుకూలంగా స్పందించాలి.**
5. **మంచి సాహిత్యాన్ని చదివించాలి. మహాత్ముల జీవితాల్లోని స్ఫూర్తిదాయకమైన సంఘటనలను వివరించాలి.**
6. **సంగీతం, గానం, నృత్యం మొదలైన కళల్లో పిల్లలకు అభిరుచి కలిగేలా ప్రోత్సహించాలి.**
7. **ప్రతిరోజూ కొన్ని సూక్తులు, నీతి పద్యాలు, గీతా శ్లోకాలు పిల్లల చేత కంఠస్థం చేయించి, వాటి అర్థాలను వివరించాలి.**

మార్పు

ఒకరోజు రామకృష్ణ మఠం స్వామీజీ ఒకరు బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురు చూస్తుండగా ఒక వ్యక్తి వచ్చి "స్వామీజీ! నేను ఏ రంగు రాయి ఉంగరం పెట్టుకుంటే మంచిదో సెలవు ఇవ్వండి" అని అడిగాడు. ఆ ప్రశ్న విన్న స్వామీజీ "నీకు ఏ రంగు ఇష్టమో ఆ రంగు రాయి ఉంగరం పెట్టుకో" అని బదులిచ్చారు. "నా గ్రహాలు బాగులేవని, రంగు రాయి పెట్టుకుంటే కలిసి వస్తుందని మిమ్మల్ని అడిగాను, మీరు అలా అంటారేంటి స్వామీజీ!" అని చెప్పి అసంతృప్తిగా ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు.

గుడి ముందు ఉన్న ద్వారపాలకుణ్ణి చూస్తూ గుడిలో దేవుడి దర్శనం చేసుకోవడం మర్చిపోయినట్లుగా, అసలు దైవాన్ని మరచి చిల్లర దేవుళ్ళను తృప్తి పరచినంత మాత్రాన ప్రయోజనం ఉండదు.



మనిషికి కష్టం వచ్చినప్పుడు మార్పు కోరుతాడు. అదే సుఖం వచ్చినప్పుడు ఏ మార్పూ లేకుండా శాశ్వతంగా అలాగే ఉండిపోవాలి అనుకుంటాడు. ఇందుకోసం గ్రహాల స్థితి గతులపై ఆధారపడి రాళ్ళు, తాయెత్తులు ధరిస్తాడు. కానీ ప్రపంచంలో మార్పు సహజం అన్నది గ్రహించాలి. పాత ఫోటోలని చూసినప్పుడు మారుతున్న కాలంతోపాటు మనలో వచ్చిన ఎన్నో మార్పులను గమనిస్తాం. మనలో వచ్చే మార్పులనే మనం ఏమీ చేయలేక పోతున్నప్పుడు గ్రహాల మార్పులను రాళ్ళతో నివారించాలనుకోవడం ఎంత అజ్ఞానం!

ఒక మహారాజు తన రాజ్యంలో ఉన్న జ్ఞానులందరినీ పిలిపించి 'నా జీవితంలో కలిగే కష్టాల్లోనూ, సుఖాల్లోనూ; విజయాల్లోనూ, అపజయాల్లోనూ; సర్వవేళలా, సర్వావస్థల్లోనూ; నన్ను రక్షించి సరైన మార్గంలో నడిపించేందుకు ఏదైనా ఒక మంత్రం ఉపదేశించండి' అని కోరాడు.

రాజు ప్రశ్న విని ఆశ్చర్యచకితులైన జ్ఞానులు ఎంతో ఆలోచించిన తరువాత అందరూ కలిసి ఒక నిర్ణయానికి వచ్చారు. వారిలో ఒక వృద్ధుడు కాగితంపై ఏదో వ్రాసి "రాజా! ఇది మీ ప్రశ్నకి సమాధానం. మీరు కష్టకాలములో, నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే ఈ కాగితంలో ఉన్నది చదవండి" అని ఆ రాజుకి ఇచ్చాడు. రాజు ఆ కాగితాన్ని తీసుకొని తన ఉంగరంలో భద్రపరుచుకున్నాడు.

కొంత కాలం తరువాత శత్రువులు ఆ రాజ్యంపై దాడి చేశారు. ఎంతో ధైర్య సాహసాలతో ఎదురించిన రాజుకి ఓటమి తప్పలేదు. శత్రుసైన్యం తన ప్రాణం తీయడానికి వెంబడిస్తున్న విషయం గమనించిన రాజు ప్రాణభయంతో తన గుర్రంపై అడవిలోకి పారిపోయాడు. అలా వెళ్తున్న రాజుకు ఒక పెద్ద లోయ ఎదురైంది. ముందుకు పోవడానికి మార్గం లేదు ఇక మరణం తప్పదని చింతిస్తుండగా చేతి ఉంగరంపై దృష్టి పడింది. ఉంగరంలోని కాగితం తెరిచి చూడగా "ఇదీ మారుతుంది" అని వ్రాసి ఉంది. అది చదివిన రాజు "కొన్ని రోజుల క్రితం ఎంతో వైభవంగా జీవించిన నేను ఇప్పుడు ఈ దీన స్థితిలో ఉన్నాను. ఆనాటి స్థితి మారినట్లే ఈ స్థితి కూడా మారుతుంది" అని అనుకొని ధైర్యం తెచ్చుకున్నాడు.

ఇంతలో తనని వెంబడిస్తున్న శత్రువులు దారి మళ్ళారు అని తెలుసుకున్న రాజు ఆ అడవిలోనే ఒక సురక్షిత ప్రదేశంలో నివసించ సాగాడు. కొంత కాలానికి అక్కడ నుండే సైన్యం సమకూర్చుకొని యుద్ధంచేసి తన రాజ్యం తిరిగి పొందాడు. పూర్వ వైభవాన్ని మరలా పొందిన రాజు "ఇదీ మారుతుంది" అని అనుకొని నిరాడంబరంగా రాజ్య పాలన కొనసాగించాడు.

కష్టాలు కలకాలం ఉండవని శ్రీశారదాదేవి ఇలా చెప్పారు: "కష్టాలు వస్తూంటాయి కానీ కలకాలం ఉండవు. వంతెన కింద పారుతున్న నీటిలా అవి దొర్లిపోతాయి"

కష్టసుఖాలు పగలూ రేయిల్లాంటివి. అవి ఒకదాని తరువాత ఒకటి వచ్చి పోతుండడం సహజం. కాబట్టి కష్టం వచ్చినా, సుఖం వచ్చినా "ఇదీ మారుతుంది" అని గ్రహించగలిగినవాడు ప్రశాంతంగా జీవించగలం. ❖



శ్రీరామకృష్ణ నామంలో అంతరార్థం

– స్వామి జ్ఞానదానంద

నామానికీ, దాని అర్థానికీ మధ్య ఒక శాశ్వత సంబంధం ఉంటుంది. అర్థం రెండు రకాలు: అక్షరాక్షర అర్థం, అంతర్గత ప్రాధాన్యం గల అర్థం. 'రామకృష్ణ' అనే పదానికి అక్షరాక్షర అర్థం–ఆ పేరుతో రూపొందిన వ్యక్తి క్షుదీరామ్, చంద్రమణిల కుమారుడు, దక్షిణేశ్వర ఆలయ పూజారి మొదలైనవి. కానీ, 'రామకృష్ణ' అనే పదానికి అంతర్గత ప్రాధాన్యంగల అర్థం – ఈయన సర్వస్వతంత్రుడైన భగవంతుడు, సచ్చిదానందుడు, ఒక అవతారం. ఈ మంత్రాన్ని పునరుచ్చరించి దాని అర్థాన్ని అవగతం చేసుకొన్నప్పుడు, ఆ నామంలోని శక్తి అనుభూత మవుతుంది.

పండితుడూ, సుప్రసిద్ధుడూ, వారణాసి వాస్తవ్యుడూ అయిన స్వామి భాగవతానంద ఒకసారి 'రామకృష్ణ' నామం వెనుక ఉన్న విస్తారమైన అర్థాన్ని ఇలా వివరించి చెప్పారు:

సాధారణ దృక్పథం నుండి చూసినప్పుడు రామకృష్ణ కేవలం ఒక పేరు; కానీ తరచి అన్వేషించి చూస్తే అద్భుతాలు కనిపిస్తాయి. ఉదాహరణకు: *'రమన్తే యోగినః అస్మిన్ ఇతి రామః'* –ఎవరైతే యోగులకు హర్షాన్ని ఇచ్చేవాడో అతడే రాముడు; *'కర్షతి భక్తానాం దుఃఖం పాపం మనోవేత్తి కృష్ణః'* –భక్తుల మనస్సులను ఆకర్షించి వారిని తన భక్తిలో ద్రవింప జేసేవాడే కృష్ణుడు. రాముడు, కృష్ణుడు ఆ యా యుగాలలో మానవాళి దుఃఖాలను బాపడానికి అవతరించారు. ప్రస్తుతం వారు సంయుక్తంగా శ్రీరామకృష్ణుల రూపంలో అభివ్యక్త మయ్యారు.

రామనామంలో ఒక రహస్యం ఉంది. రాముడు జన్మించి నప్పుడు, తండ్రి అయిన దశరథుడు తన కుమారుడికి నామకరణం చేయాల్సిందిగా వశిష్ఠ మహర్షిని కోరాడు. "ఈ పిల్లవాడి పేరు రాముడు" అని వశిష్ఠుడు నామకరణం చేశాడు. అది విని దశరథుడు, ఆయన మంత్రులు ఇలా అన్నారు: "పేరు చాలా సంక్షిప్తంగా ఉంది. ఈ పిల్లవాడు సింహాసనం అధిష్ఠిస్తాడు. కనుక ఇతడికి పొడవైన, గంభీరమైన నామధేయం ఉండాలి." అప్పుడు వశిష్ఠుడు ఇలా చెప్పాడు: "ఓ రాజా! 'రామ' అనే పేరులోని యశస్సు, గొప్పదనం గురించి నీకు తెలియదు. దయచేసి విను: 'రామ'లోని 'రా' అనే అక్షరం 'నమో నారాయణాయ' అనే మంత్రం నుంచి వచ్చింది; ప్రసిద్ధమైన వైష్ణవ మంత్ర సారం ఇది. ఆ మంత్రం నుంచి 'రా' ను తొలగిస్తే, ఆ మంత్రం 'నమో నాయణాయ'గా మారిపోయి, 'నాయణునికి నమస్కారాలు'గా మారి, లోకంలోని ఇంద్రియపరమైన వస్తువులకు నమస్కారాలు' అని అర్థం వస్తుంది.

అదే విధంగా 'రామ'లోని 'మ' అనే అక్షరం 'నమశ్శివాయ' అనే మంత్రం నుంచి వచ్చింది. దీని అర్థం 'మంగళప్రదుడైన శివునికి నమస్కారాలు'. ఈ మంత్రం నుంచి 'మ' అనే అక్షరాన్ని తొలగించి వేస్తే, 'న శివాయ'– 'సమస్తం అమంగళప్రదం' అనే అర్థం వస్తుంది." ఆ విధంగా వశిష్ఠుడు రామ నామంలోని గూఢార్థాన్ని వెల్లడించినప్పుడు దశరథుడు ఎంతో సంతోషించాడు. రామకృష్ణుల పేరులో రా, మ అనే రెండు అక్షరాలున్నాయి.

కృష్ణ నామం యొక్క ఆధ్యాత్మికపరమైన అర్థం ఇది: కృష్ ధాతువు అర్థం 'సర్వదా అస్తిత్వం ఉన్న బ్రహ్మం'. 'ణ' అంటే ఆనందం అని అర్థం. కాబట్టి కృష్ణ అనే పదానికి అర్థం సత్, ఆనందం. రామకృష్ణ నామధేయంలో కృష్ణ కూడా చేరి ఉంది. ఈ నామధేయం మహత్వం వర్ణనాతీతం.

మంత్రదీక్ష స్వీకరించినవారు తమ ఇష్టదైవ నామాన్ని పునరుచ్చరిస్తారు. కనుక ఆ నామ అంతరార్థాన్ని వారు తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. భగవంతునికి సమీపంలో ఉండడానికి సాధకునికి అది దోహదం చేస్తుంది. కర్మ, ప్రార్థన, జపం, ధ్యానం ద్వారా మనం భగవంతునిలో ఐక్యం కావడానికి ప్రయత్నిస్తాం. భగవంతుని యథార్థ నైజం గురించిన స్పష్టమైన జ్ఞానం కలిగి ఉంటే, మన ఆధ్యాత్మిక సాధనలు సుగమంగా ఆనందంగా సాగిపోతాయి. మహాసమాధికి రెండు రోజుల ముందు శ్రీరామకృష్ణులు, వివేకానందతో ఇలా చెప్పారు: "ఎవరు రాముడుగా, కృష్ణుడుగా అవతరించారో వారిప్పుడు ఈ శరీరంలో రామకృష్ణగా జీవిస్తున్నారు – నీ వేదాంత ధోరణిలో మాత్రం కాదు."❖

ఏకాగ్రత – ధ్యానం

– స్వామి యతీశ్వరానంద



ఏకాగ్రతకూ, ధ్యానానికీ చాలా తేడా ఉందని మనం తెలుసుకోవాలి. ధ్యానం అంటే పూర్తి మనస్సుతో చేసే గాఢ చింతనం. సాధారణమైన ఏకాగ్రత కన్నా ఇది ఎంతో ప్రత్యేక మైనది. మొదట మనం తెలుసు కోవాల్సిన విషయం ఏమిటంటే, ధ్యానం అనేది మనలోని సంకల్ప శక్తిని ఉపయోగిస్తూ, మనం ప్రయత్న పూర్వకంగా చేసే ప్రక్రియ. రెండో విషయం, ధ్యానాన్ని ఒక ఆధ్యాత్మిక పరమైన భావన మీద చేస్తాం. ప్రాపంచికమైన భావనలకు అతీ తంగా సాధకుడు ఒక ఉన్నతస్థితిని అందుకోగలిగి ఉండాలి. అప్పుడే సాధకుడు ధ్యానం చేస్తున్నట్లు లెక్క. కాబట్టి ధ్యానం అనేది దీర్ఘకాల అభ్యాసం తర్వాత చేరుకునే చాలా ఉన్నతమైన స్థితి అని మనం తెలుసు కోవాలి.

రకరకాల చెడు ఆలోచనల వల్ల, నీచమైన ప్రవృత్తుల వల్ల మనస్సు భగవన్ముఖం కానేరదు. మనస్సును అంతర్ముఖం చేసి, భగవంతుని మీద నిలపడానికి సాధకుడు పదే పదే ప్రయత్నిస్తుంటాడు. మనలో చాలామంది ఈ స్థితిలో కొనసాగుతూ ఉంటారు. దీనిని 'ప్రత్యాహారం' అంటారు. మనస్సును అంతర్ముఖం చేసి, ఒక భగవన్మయమైన భావన మీద కొద్దిసేపు నిలపగలిగితే, దాన్ని 'ధారణ' అంటారు. ధారణను తెంపు లేకుండా తైలధారలా కొనసాగిస్తే అది 'ధ్యానం' అవుతుంది. ఈ స్థితిలో మనలోని బహిర్ముఖ ప్రవృత్తులు పూర్తిగా నియంత్రితం కావాలి.

మామూలు మనిషి వస్తుసంపదలు, లాభాలు, ఐహిక సుఖాలు మొదలైనవాటి మీదే తన ఏకాగ్రతా శక్తులను ఉపయోగిస్తుంటాడు. ఒక శాస్త్రవేత్త పరమాణునిర్మాణం మీద లేదా వృక్షస్వభావం మీద తన శక్తియుక్తులను కేంద్రీక రిస్తుంటాడు. ఒక మానసిక నిపుణుడు తన విశ్లేషణాశక్తిని ఆలోచనా విధానం మీద ఉపయోగిస్తుంటాడు. అలాగే యోగి తన స్వభావంలోని అహంకారజనిత అంశాలనూ, అహంకార జనితం కాని సంస్కారాలనూ పరిశీలిస్తుంటాడు. స్థూలంగా చూస్తే, ఇవన్నీ ఏకాగ్రత మీద చేసే ప్రయోగాల క్రిందకే వస్తాయి. కానీ సూక్ష్మదృష్టితో చూస్తే, ఈ ప్రయోగాలు చేసిన విషయాలలో చాలా వైవిధ్యం ఉందనీ, విధి విధానాలు కూడా పూర్తిగా వేర్వేరనీ, ఫలితాల విషయాని కొస్తే అవి కూడా విభిన్నమైనవనీ చెప్పక తప్పదు. ఏ మార్గానికి చెందిన వాడైనా, ఒక ఆధ్యాత్మిక సాధకుని ఏకాగ్రతను మాత్రమే 'ధ్యానం' అని చెప్పవచ్చు.

వట్టి ఏకాగ్రతకు ఆధ్యాత్మిక పరమైన ఉపయోగం ఏమీ ఉండక పోవచ్చు. సాధకుడు కొంత స్థాయిలో మానసికమైన పవిత్రత పెంపొందించుకొని, తన కోరికలకు తగిన విధంగా ఉన్నతమైన దిశా నిర్దేశం చేయకపోతే ఏకాగ్రత ప్రమాదకరం కావచ్చు కూడా! మనం చేసే పనులు, ఆలోచనల వల్ల మన మనస్సు మీద ఏర్పడే కుసంస్కారాలను ఎంతగా పోగొట్టుకోగలిగితే అంత బాగా ఆధ్యాత్మికపరమైన లాభం చేకూరుతుంది. అంటే మన మనస్సు నుంచి మాలిన్యాలనూ, కల్మషాలనూ పూర్తిగా ప్రక్షాళనం చేయాలి. ఎంతో ఉన్నత స్థాయికి చేరిన వైరాగ్యం, పవిత్రత మాత్రమే సాధకునికి ఆధ్యాత్మికపరమైన ఏకాగ్రత, ధ్యానాలను ఇవ్వగలవు. ఆ విధమైన మనస్సుతో చేసిన ఏకాగ్రత, ధ్యానం మహోన్నతమైన దివ్యానుభూతులనూ, చివరకు ముక్తినీ సాధకునికి ప్రసాదించగలవు.

సాధారణంగా మన మనస్సు ప్రాపంచిక విషయాలపై ఏకాగ్రమైనంత త్వరగా భగవంతునిపై అవదు. కాబట్టి భగవంతునిపై అనురాగం కలిగేలా ప్రార్థించమని విష్ణు పురాణం *(1.20.17)* ఇలా చెబుతోంది:

యా ప్రీతి రవివేకినాం విషయేష్వనపాయినీ ।
త్వామను స్మరతః సా మే హృదయాన్మా ఽ పసర్పతు ॥

ఓ దేవా! అజ్ఞానులు ప్రాపంచిక విషయాల కోసం తపించినట్లు, నేను నీ కోసం తపించాలి. నీ పట్ల నాలో ఉన్న ప్రేమ ఎన్నడూ తొలగిపోదు గాక! ❖

అనువాదం : ఎమ్. శివరామకృష్ణ

పరమేశ్వరుని పరిరక్షణలో ...

స్వామి జపానంద స్వీయ అనుభవాలు -34

మాతృభూమి సేవలో విప్లవ దళం

ఫరీద్‌పూర్ సమీపంలోని ఓ గ్రామం - చట్‌గావ్. ప్రస్తుతం ఇది బంగ్లాదేశ్‌లో ఉంది. అక్కడి కలెక్టర్ గారి స్టెనోగ్రాఫర్ అయిన బిల్ గారి ఇంట్లో స్వామి జపానంద బస చెయ్యడానికి ఏర్పాటు చేశారు. ఆ కాలంలో చట్‌గావ్‌లో శ్రీరామకృష్ణ సేవా సమితి ఉండేది. ఆ సమితి కార్యకలాపాలన్నీ విప్లవకారుడైన సూర్యసేన్ ఆధ్వర్యంలో జరిగేవి.

సూర్యసేన్‌ని అక్కడ అంతా 'సూర్యదా' అనడం పరిపాటి. సూర్యదా ఇంటికి స్వామి రెండు సార్లు వెళ్ళారు. వాళ్ళంతా విప్లవకారులనీ, వాళ్ళకు ప్రత్యేకంగా ఒక దళం ఉందనీ, వాళ్ళందరూ తమ జీవితాలను మాతృభూమి సేవకు అంకితం చేశారనీ ఒకరోజు మాటల సందర్భంలో స్వామీజీకి తెలిసింది.

ధనం లేకుండా మాతృభూమికి సేవ చేయడం, అది కూడా బ్రిటిష్ వాళ్ళకు ఎదురు తిరగడం అసాధ్యమైన పని. ఆ పని కోసం వాళ్ళు దోపిడీలు తప్ప వేరే మార్గమేదీ ఎన్నుకోలేక పోయారు. కానీ అలా చేస్తే తమ దేశవాసులకే హాని కలుగుతుంది. అయితే ధనం సంపాదించడానికి వాళ్ళకు మరో మార్గం లేదు. ఈ మాటలన్నీ వాళ్ళు సన్న్యాసి సమక్షంలోనే మాట్లాడుకునేవారు. సన్న్యాసి ఇవన్నీ మౌనంగానే వినేవారు.

ఒకరోజు మాత్రం ఆయన ఉండబట్టలేక, "ధైర్యం చేసి బ్రిటిష్ వాళ్ళ ప్రభుత్వ ధనాగారం కొల్లగొట్టే ప్రయత్నం చెయ్యండి. అప్పుడు మన దేశానికీ, దేశవాసులకీ కూడా లాభం. మన వాళ్ళ ధనమే దొంగిలించి, వాళ్ళ ఆస్తులను నాశనం చేస్తే దేశానికి ఏం వస్తుంది! అది పిరికి వాళ్ళు చేసే పని. బుద్ధిహీనుల పని. కొత్త బందిపోట్లు తయారై, దేశం పేరిట దొంగతనాలు చేసి డబ్బు దోచుకుంటారు. ఆ విధంగా కొత్త వాళ్ళు నైతికంగా దిగజారిపోతారు" అని అన్నారు. అది విని అక్కడ అందరూ మౌనంగా ఉండిపోయారు. ఎవరూ మాట్లాడలేదు.

ఆ తరువాత స్వామి చాలాసార్లు 'సూర్యదా'ను కలిశారు. కానీ ఈ విషయం గురించి వారి మధ్య ఎప్పుడూ ప్రస్తావన రాలేదు. సమితి కార్యాలయ భవనం దగ్గరే విద్యార్థుల వసతి గృహం కూడా ఉండేది. ఆ వసతి గృహం చూడడానికి ఒకరోజు స్వామి జపానంద వెళ్ళారు. స్వామి, విద్యార్థుల వసతిగృహం చూస్తూ "సూర్యదా! మీరు ఈ వసతి గృహాన్ని ఒక కోటలా కట్టారు. ప్రతి గదీ వేరేగా ఉంది. ప్రతి గది ద్వారం వీధి వైపుగా ఉంది. వీధులు కూడా వంకర టింకరగా ఉన్నాయి. వీధిలోకి ఎవరు ప్రవేశించినా ప్రతి గది ద్వారం దగ్గర నుంచి కనిపిస్తుంది. ఒక గది నుంచి మరొక గదికి వెళ్ళాలంటే పెరటిలో నుంచే వెళ్ళాలి. కానీ ప్రతి గది కిటికీ ఏ విధంగా కట్టబడిందంటే ఏ కిటికీలో నుంచి చూసినా వీధి మొదలు కనిపిస్తుంది. దానివల్ల పోలీసులు వస్తే పక్కవాళ్ళకు సూచించవచ్చు. గదులలో నుంచే తుపాకులు కాల్చవచ్చు" అన్నారు.

సూర్యదా నవ్వుతూ, "మీరు అనుకుంటున్నది నిజమే! మేము చేస్తున్న పనిలో ఏ క్షణమైనా పోలీసులు మాకు ఎదురు



పడవచ్చు. అందుకే ఈ విధంగా కట్టుదిట్టంగా ఈ గృహం కట్టించాం. మేము ఈ యువకులందరినీ కూడా ఆ విధంగా మలచాలి కదా! వీళ్ళందరూ తమ జీవితాల్ని మాతృభూమికి అంకితం చేసినవాళ్ళే" అన్నాడు.

తరువాత స్వామి కాశీలో ఉండగా తెలిసింది - చట్‌గావ్‌లో ప్రభుత్వం వారి మందుగుండు సామాన్ల గిడ్డంగిపై దోపిడీ జరిగిందని! అది సూర్యదా దళం వారు చేసిన పనే! దళంలో కొంతమంది పట్టుబడ్డారు. కొంత మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు.

ఒకరోజు జపానందజీ, కాశీలో నడుస్తూ వెళుతుండగా ఒక పెద్దమనిషి ఆయన్ని సమీపించి "సూర్యదా మీకిచ్చిన మాట నిలబెట్టుకున్నారు" అని స్వామీజీతో చెప్పి వెళ్ళిపోయాడు. సూర్యదా ధైర్యానికి స్వామి జపానందజీ జోహార్లు అర్పించారు. ❖ **అనువాదం: శ్రీమతి జి.ఎస్. లక్ష్మి**

శ్రీ రామకృష్ణ అద్వైత ఆశ్రమ

(హెడ్ క్వార్టర్స్: రామకృష్ణ మఠం & మిషన్, బేలూరు మఠం)

(పి.ఒ) కాలడి, ఎర్నాకుళమ్-683 574, ఫోన్ : 0484 - 2461071; 09447051231

విన్నపం

కాలడిలోని శ్రీరామకృష్ణ అద్వైత ఆశ్రమం 5వ తరగతి నుండి 10వ తరగతి వరకూ చదివే అనాథ, నిరుపేద పిల్లల కోసం 1936 నుండీ ఒక ఉచిత వసతి గృహాన్ని నడుపుతోంది. ఈ వసతి గృహం 100 మంది పిల్లలకు ఉచితంగా భోజన బస వసతులను సమకూరుస్తూ, విద్యావ్యాసంగానికి అవసరమైన పాఠ్య గ్రంథాలను అందిస్తోంది. వీటన్నిటి నిర్వహణ కోసం **రెండు కోట్ల రూపాయల శాశ్వత నిధిని** ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. భక్తులనూ, హితైషులనూ ఉదారంగా విరాళాలీయమని కోరుతున్నాం.

శాశ్వత నిధి కోసం వసతి గృహానికి ఇచ్చే ఈ విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని 35 ఎసి ప్రకారం **నూటికి నూరు శాతం పన్ను మినహాయింపు లభిస్తుంది.**

ఆశ్రమంలో నిర్వహించే నిత్యపూజ, ఉచిత వైద్యశాలలు, ఉత్సవ నిర్వహణ లాంటి ఇతర కార్యక్రమాలకై ఇచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80 (జి) ప్రకారం పన్ను మినహాయింపు లభిస్తుంది.

విరాళాల్ని Sri Ramakrishna Advaita Ashrama, Kalady పేరున చెక్కు/ డి.డి తీసి Sri Ramakrishna Advaita Ashrama, P.O. Kalady, Ernakulam-683 574 చిరునామాకు పంపాల్సిందిగా మనవి.

విరాళాలను ఆన్‌లైన్ ద్వారా కాలడిలోని యూనియన్ బ్యాంక్‌లోని మా **అకౌంట్ నెంబర్ 338602010009164** (IFSC Code : UBIN0533866)కు నేరుగా కూడా పంపవచ్చు.

కృతజ్ఞతాభినందనలతో...

భగవత్సేవలో

స్వామి అమలేశానంద

అధ్యక్షులు

Advt.,

స్వామి వీరేశ్వరానంద స్మృతి కమిటీ

రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ల 10వ సర్వాధ్యక్షులు శ్రీమత్ స్వామి వీరేశ్వరానందజీ మహరాజ్ స్మృత్యర్థం 'స్వామి వీరేశ్వరానంద స్మృతి కమిటీ' ప్రత్యేక సంచికను వెలువరించాలని సంకల్పించింది. ఈ పుస్తకం బెంగాలీ-హిందీ- ఆంగ్ల భాషలలో వెలువడుతుంది; దీనిలో పూజ్య మహరాజ్ జీవిత విశేషాలు, లేఖలు, ఛాయాచిత్రాలతో పాటు సన్న్యాసులు, సన్న్యాసినులు, భక్తులు, అభిమానుల స్మృతులు ఉంటాయి.

పూజ్య మహరాజ్‌కి సంబంధించిన ఆసక్తికరమైన స్మృతులు/ లేఖలు/ ఛాయాచిత్రాలు ఎవరి దగ్గర ఉన్నా శ్రీ శంతను చౌధురీ పేరున దిగువ తెలిపిన చిరునామాకు పంపాల్సిందిగా మనవి :

SRIMA GROUP

62, Shalaka, D.N.Nagar,
Andheri (W), Mumbai - 400 053.

Email : srimachowdhury@rediffmail.com
sw.vireswarananda@gmail.com

ప్రచురణ విషయంలో సంపాదకునిదే తుది నిర్ణయం

Sponsored by: **The Peerless General Finance & Investment Company Limited,** Peerless Bhawan,3 Esplanade East,Kolkata-700 069. Ph : 033 - 2248 3247, website : www.peerless.co.in

Advt.,

దేవీ వైభవం

ప్రవచనం: **శ్రీ సామవేదం షణ్ముఖశర్మ** విలేఖనం: **శ్రీమతి ఎన్. శేషు**

(...గత సంచిక తరువాయి)

"సర్వప్రాణిషు ద్రవ్యేషు శోభా రూపా మనోహరా" వీటిని విభూతులు అంటారు. సృష్టిలో ఒక్కొక్కదాని యందు ఒక ఉత్కృష్ట గుణం కనిపిస్తుంది. ఆ ఉత్కృష్ట గుణమే విష్ణువు యొక్క విభూతి. విభూతి అంటే ఐశ్వర్యం అని అర్థం.

శ్రీకృష్ణ పరమాత్మ గీతలో*(10.41)* "యద్యత్ విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా,తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశ సంభవమ్". "సృష్టిలో ఎక్కడెక్కడ నా విభూతి ఉంటుందో అదంతా నా శక్తిగా గమనించు" అన్నారు; వాటిని ఉపాసించమన్నారు. సృష్టిలో తన విభూతి స్థానాలు ఏవో చెప్పారు. ఆ విభూతులు, ఆ శోభలు, ఆ ప్రకాశాలు అన్నీ అమ్మ యొక్క రూపాలు. మనలో కూడా ఈ విభూతులు రావాలంటే సర్వ విభూతి స్వరూపిణి అయిన అమ్మవారిని ఆశ్రయించాలి. "శ్రద్ధాం విభూతిం సురభిం..." అనడంలో శ్రద్ధ అంటే శాస్త్రవాక్యాలు, గురువాక్యాలు, ఋషివాక్యాల యందు ఆస్తిక్యబుద్ధి. వాటి యందు శ్రద్ధ. శ్రద్ధావంతులకు అమ్మ విభూతి స్వరూపిణిగా అనుగ్రహిస్తుంది. "కీర్తిరూపా పుణ్యవ్రతాం ప్రభారూపా నృపేషు చ" – రాజుల యందు తేజస్సు గానూ, పుణ్యవంతుల యందు కీర్తి గానూ; "వాణిజ్యరూపా వణిజాం" – వ్యాపారవేత్తల యందు వ్యాపార చైతన్యంగానూ; పాపాత్ముల దగ్గర జ్యేష్ఠాదేవిగానూ ఉంటుంది. సత్పురుషుల ఇళ్ళల్లో లక్ష్మీ స్వరూపంగా ఉంటుంది అమ్మ.

ధర్మం కోసం, మోక్షం కోసం చేసే పని మంచి పని, అది చెయ్యనివాళ్ళు పాపాత్ములు. "పుణ్యాపుణ్య ఫలప్రదా" – అమ్మవారు పుణ్యం చేసినవారికి పుణ్యఫలమూ, పాపం చేసినవారికి పాప ఫలమూ ఇస్తారు.

ఏది పుణ్యం ఏది పాపం అంటే "నిజాజ్ఞా రూప నిగమా" శ్రుతి స్మృతులు ఆ తల్లి యొక్క ఆజ్ఞలు; అమ్మవారి ఆజ్ఞలను ఎవరు పాటిస్తారో వారు పుణ్యాత్ములు, అతిక్రమించినవారు పాపాత్ములు. పాపుల ఇళ్ళలో అమ్మవారు కలహ రూపంలో ఉంటారట. కలహం అనేది ప్రవేశిస్తే కలిపురుషుడు ప్రవేశించి నట్టే! అయితే అమ్మవారి అనుగ్రహం ఉంటే ఈ కలహాలుండవు. అందుకే కష్టపడి సాధన చేస్తే అమ్మవారి అనుగ్రహం వల్ల కలిబాధలు పోగొట్టుకోవచ్చు. ఎందు కంటే అమ్మవారి పేరే "కలికల్మష నాశిని". అలా అమ్మను ఆరాధించి కలికల్మషాలన్నీ పోగొట్టుకోవాలి.

"వాక్ బుద్ధి విద్యా జ్ఞానాధిష్ఠాత్రి చ పరమాత్మనః"– పరమాత్మ యొక్క జ్ఞానశక్తి అమ్మ అన్నారు. జ్ఞానమే ఆయన, ఇంత జగతిని మలచిన ఆయన జ్ఞానం ఎంతో అద్భుతమైనది. ఈ జగత్తులోని ప్రతి శబ్దమూ ఆయన కంఠధ్వనే! పరమేశ్వరుని యొక్క వాక్ బుద్ధి జ్ఞానం... అన్నిటి సమాహార స్వరూపమే సరస్వతి. అందుకు సృష్టిలో ఏది కావాలన్నా అమ్మ దగ్గరకు వెళ్ళాలి. మనలో నిండి ఉన్న చైతన్యం ఆ పరమేశ్వరుడు లేదా పరమేశ్వరి యొక్క చైతన్యమే. నిరంతర ఉపాసన ద్వారా ఆ శక్తిని సంపాదించుకోగలం.

లోకంలో విద్యలు పరావిద్య, అపరావిద్య అని రెండు రకాలు. లోకంలో అనేక రకాల అపూర్వమైన జ్ఞానాలున్నాయి, అవన్నీ లౌకికాలు, వీటిని అపరా విద్యలు అంటారు. పరావిద్య అంటే బ్రహ్మ విద్య. ఈ రెండూ కూడా అమ్మ యొక్క స్వరూపాలు. సృష్టిలో ఇప్పటికి ఎందరో వచ్చారు. కానీ ఎప్పటికప్పుడు ఏదో ఒక కొత్తదనం కనిపిస్తోంది. అది పరమేశ్వరుడు చూపిస్తున్న ప్రతిభ.

మేధస్సు, ప్రతిభ, స్మృతి – అన్నీ బుద్ధిలో ఉన్నాయి. అమ్మ అనుగ్రహం లేకపోతే ఇవేవీ రావు. స్మరణ, స్మృతి అనేవి ఆ తల్లి అనుగ్రహం వల్లనే లభిస్తున్నాయి. సృష్టిలో అనేక రకాల సిద్ధాంతాలు, విజ్ఞాన పద్ధతులు, సంప్రదాయాలు, వ్యాఖ్యానాలు, బోధన జ్ఞానాలు ఉన్నాయి. ఇవన్నీ అమ్మ స్వరూపాలు. అమ్మని ఉపాసిస్తే జీవితంలో ఎప్పుడూ వినని విజ్ఞానాన్ని కూడా వారి బుద్ధికి అమ్మ ఇస్తుందట. అమ్మను ఆశ్రయిస్తే మన బ్రతుక్కి ఏది కావాలో, మనం తరించడానికి ఏది కావాలో ఆ విద్యను అమ్మ మన బుద్ధిలో భాసిస్తుందట. ఆ తల్లి అనుగ్రహం లేకపోతే జగత్తంతా జడమై పోతుంది.

భౌతికావస్థ నుండి బ్రహ్మవిద్యావస్థ వరకూ శారదాదేవి అనుగ్రహం అడుగడుగునా కావాలి. సృష్టిలో పిచ్చివాళ్ళు, మూర్ఖులు, మాటలు రానివాళ్ళు - వీళ్ళందరూ అమ్మ అనుగ్రహం లేనివాళ్ళు. అమ్మ అనుగ్రహం ఉన్న వారికి "మతిదా స్మృతిదా" - ఆ బుద్ధి అమ్మ ఇస్తుంది.

ఆలోచించగలిగే శక్తినీ, ఆ ఆలోచనలను కాగితం మీద పెట్టే శక్తినీ అమ్మే ఇస్తుంది. ఆ తల్లి సంగీత విద్యా స్వరూపిణి, నాదవిద్యా స్వరూపిణి. అమ్మ దయ ఉంటేనే సంగీత విద్య వస్తుంది. మహాకవి కాళిదాసు "సరిగమ పదనిర తాం తాం

వీణా సంక్రాంత కాంత హస్తాంతాం శాంతాం మృదుల స్వాంతాం కుచభర తాం తాం నమామి శివకాంతాం" అన్నారు. సంగీత స్వరూపిణి అయిన ఆ జగదంబిక విషయజ్ఞానములిచ్చి సర్వజీవులనూ కటాక్షించేది. "శరణం కరవాణి శర్మదంతే చరణం వాణి చరాచరోపజీవ్యం"- అమ్మా నీ పాదాల కాంతి కిరణాల వల్ల ఈ చరాచర జగత్తు బ్రతుకుతోంది అన్నారు.

అమ్మవారి తెల్లదనాన్ని వర్ణిస్తూ సృష్టిలో ఉన్న తెల్లదనాలన్నీ చూసి ఇవేవీ కావు అనుకున్నారట. అదీ ఇదీ చెప్పి చివరకు వీటన్నిటినీ మించిన ధవళిమతో ప్రకాశిస్తున్న తల్లీ

శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా
హార తుషారఫేన రజతాచల కాశ ఫణీశ కుంద మం
దార సుధాపయోధి సితతామర సామర వాహినీ శుభా
కారత నొప్పు నిన్ను మదిఁ నెన్నడు గల్గు భారతీ!

అని కీర్తించారు పోతన.

ఆ శారదాంబ అనుగ్రహం లేనిదే సృష్టిలో ఏదీ చలించ లేదు. కనుక "ప్రతి విశ్వోపజీవిని వ్యాఖ్యావాదకరీ శాంతా వీణా పుస్తక ధారిణి" అన్నారు. అమ్మ వారు ధరించిన రూపం, రంగులు ఇవన్నీ తత్త్వాలు చెప్తాయట. అందుకు అమ్మవారు ఒక గ్రంథాన్ని పట్టుకుని, చిన్ముద్రను పట్టుకుని వీణధరించి, అక్షమాలను పట్టుకున్నారంటే ఆ అక్షమాల "అ"నుంచి "క్ష" వరకు ఉన్న అక్షరవిద్యలే ఆ తల్లి అని చెప్తున్నది. అలాగే పుస్తకం - జ్ఞానాన్ని ఒక క్రమంలో కూర్చే గ్రథనశక్తికి గ్రథనం అనిపేరు, అమ్మని మనం పూజిస్తే ఆ తల్లి అనుగ్రహం వల్ల ఆ చేతిలో ఉన్న పుస్తకం మనకి గ్రథన శక్తినిస్తుంది. ఆ తల్లి యోగవిద్యారూపిణి, నాదవిద్యారూపిణి అని చెప్పడానికే అమ్మ వీణను, చిన్ముద్రను ధరించి ఉంది; "పరావిద్యని అందచేసే తల్లిని నేనే" అని చెప్పడానికి చిన్ముద్ర ధరించి ఉంది అమ్మ. ఇలాగ అమ్మ యొక్కశారదా రూపాలు అనేకములున్నాయి.

అటువంటి ఆ తల్లిని "శుద్ధసత్త్వ స్వరూపాచ సుశీలా" అని కీర్తించి వ్యాసుడు "హిమ చందనకుందేందు కుముదాం భోజసన్నిభా" అన్నాడు. ఈమె తెల్లదనం ఎలా ఉంటుందంటే... హిమము (అంటే మంచు) వలె ఉంటుంది... కాదు చందనంవలె ఉంటుందన్నారు, అదీ కాదు కుందా (మల్లె) లాగ ఉంటుందన్నారు; ఇందు (చంద్రుడు)లాగ ఉంటుందన్నారు, అదీ నచ్చలేదు తెల్లకలువ (కుముదాంభోజ) లాగ ఉంటుందన్నారు. ఎంత చెప్పినా అమ్మ అమ్మలాగే ఉంటుంది, పోల్చతగ్గ వస్తువులేదు అన్నారు.

మనం చదివే మంత్రాలు అంటే అక్షరాలే, శబ్దాలే. మన ఆలోచనలు, ఆ శబ్దాలు, మంత్రాలు అన్నీ అమ్మ రూపాలే. "దేవీం వాచమజనయంతదేవాః" అని శారదాదేవికి నమస్క రించనిదే మనం ఏపూజ అయినా చెయ్యలేం. పూజాకల్ప విధానం జాగ్రత్తగా చెయ్యడానికి అమ్మ అనుగ్రహం ఉండాలి.

"తపస్స్వరూపా తపసాఫలధాత్రీ తపస్వినాం సిద్ధివిద్యా స్వరూపాచ సర్వసిద్ధి ప్రదాసదా యయావినా త విప్రౌభౌమూ కోమృత నమస్సదా" ఎంత గొప్పజాతిలో పుట్టిన వాడైనా అమ్మ అనుగ్రహం లేకపోతే వాడు మూగవాడు జీవన్మృతుడు అన్నారు. ❖ **(సశేషం)**

విద్య అంటే ఏమిటి?

విద్య అంటే ఏమిటి? నానా విధమైన జ్ఞానమా? కాదు. సంకల్ప ప్రవాహ ప్రకటనలను వశంలో ఉంచుకొని, ఫలింపచేసే శిక్షణను విద్య అంటారు. తరతరాలుగా నిర్బంధించే సంకల్పశక్తిని నిరంతరంగా అడ్డుకొనేదేదో, దేని చేత సంకల్పశక్తి ఇంచుమించు అంతరించి పోయిందో, దేని చేత కొత్త భావాలూ, వాటితో పాటు పాతవి సైతం ఒకదాని వెంట ఒకటిగా అదృశ్యమవుతున్నాయో అది విద్యా? ఆలోచించండి. మానవుణ్ణి క్రమక్రమంగా యంత్రంగా మార్చేది విద్యా? యంత్రంలా ప్రవర్తిస్తూ సన్మార్గంలో ఉండే కన్నా, బుద్ధితో, స్వతంత్ర సంకల్పంతో ప్రేరేపితమై, చెడు దారి పట్టడం సైతం సబబే అని నా అభిప్రాయం. ఎక్కడ మానవులు మట్టిముద్దల్లా, నిర్జీవయంత్రాల్లా, పేర్చిపెట్టిన రాళ్ళలా ఉంటారో దాన్ని సమాజం అనవచ్చా? అలాంటి సమాజానికి మేలు ఎలా కలుగుతుంది? అలాంటి స్థితి వల్ల మేలు సాధ్యమైతే, శతాబ్దాల పర్యంతం మనం బానిసలుగా ఉండి ఉండం. భూమండలంలో మన దేశం సర్వాధికమై ఉండి ఉండేది. ఈ భారతభూమి మూఢత్వఖనిగా ఉండక, పాండిత్యానికి నిత్య ప్రభవమై ఉండి ఉండేది.

మరి 'నా కేమీ వద్దు' అనుకోవడం సుగుణం కాదా? అనేకుల క్షేమానికై ఒక్కడు తన సుఖాన్ని త్యజించడం పరమధర్మం కాదా? ధర్మమే. కానీ "తోమడం వల్ల, రాయడం వల్ల అందాన్ని రూపొందించగలమా? నిర్బంధం వల్ల, ప్రయత్నం వల్ల ప్రేమను పుట్టించగలమా?" అని వంగభాషలో సామెత ఉంది. నిత్యదరిద్రుడు 'నా కేమీ వద్దు' అనడంలో గొప్ప ఏముంది? ఇంద్రియశక్తి లేనివాడి ఇంద్రియనిగ్రహంలో సద్గుణం ఏముంది? భావశూన్యత, హృదయశూన్యత, ఉన్నతాభీష్ట శూన్యతలతో సమాజం అంటే ఏమిటో ఎరుగని వ్యక్తి యొక్క ఆత్మత్యాగం అంటే ఏమిటి? వితంతువును నిర్బంధించి సహగమనం (సతి) చేయించడం వల్ల పతిభక్తి వెల్లడవుతుందా? మూఢ విశ్వాసాలను అలవరచి జనంచేత ధర్మకార్యాలు చేయించడం ఎందుకు? నేను చెప్పేదేమంటే, సాధ్యమైనంత వరకు ప్రజల సంకెళ్ళను తెంచివెయ్యండి. స్వేచ్ఛ నివ్వండి. మురికి, మురికిని కడిగివేస్తుందా? దాస్యం, దాస్యాన్ని తొలగించగలదా? సమాజం నిమిత్తం భోగాభిలాషను పూర్తిగా త్యజించగలిగితే, అప్పుడు స్వతంత్రులవుతారు.

ప్రజల్లో మూఢ విశ్వాసాలను పారద్రోలి, దాస్య భావాలను తొలగించి, నిస్వార్థ ప్రేమను పెంచి స్వతంత్రులను చేసేదే నిజమైన విద్య. ❖

పరిప్రశ్న

- స్వామి సుకృతానంద

శిష్టా కృష్ణశర్మ, విశాఖపట్నం.

? : నేను, మరణానంతరం నా మృతదేహాన్ని ఇచ్చటి వైద్యశాలకు దానం చేయదలచుకున్నాను. ఇది శాస్త్ర సమ్మతమా?

✍ : ప్రమాదాల్లోనూ, ప్రాణాపాయ స్థితిలోనూ నేత్రదానం, రక్తదానం, కాలేయదానాలు ఇతరులకు అత్యంత ఉపయోగపడినప్పుడు వైద్యకళాశాల అంగీకరిస్తే మీరు తప్పక ఇవ్వవచ్చు.

పరోపకారాయ దుహంతి గావః
పరోపకారాయ వహంతి నద్యః ।
పరోపకారాయ ఫలంతి వృక్షాః పరోపకారార్థ మిదం శరీరమ్ ॥

పరులకు ఉపకారం చెయ్యడం కోసమే ఆవులు పాలిస్తున్నాయి. పరులకు ఉపకారం చెయ్యడం కోసమే నదులు ప్రవహిస్తున్నాయి. పరులకు ఉపకారం చెయ్యడం కోసమే చెట్లు ఫలాలను ఇస్తున్నాయి. అదే విధంగా మన శరీరం కూడా పరులకు ఉపకారం చెయ్యడం కోసమే! అని భర్తృహరి నీతి శతకం చెబుతోంది. దీనికి శాస్త్ర సమ్మతం దేనికి!

కె.వి. రామదుర్గయ్య, నెల్లూరు.

? : శ్రీకృష్ణుడు పాండవులకు అండగా ఉన్నప్పటికీ వారు అడవులపాలై అష్టకష్టాలను ఎందుకు అనుభవించారు?

✍: ధర్మమే చివరికి గెలుస్తుందని మన వేద పురాణాలు, ఇతిహాసాలు చెబుతున్నాయి. ధీరులైనవారు ఎన్ని కష్టాలు వచ్చినా వెనుకంజ వేయరు. జీవితంలో సుఖం కన్నా దుఃఖమే మనకు ఎక్కువ పాఠాలు నేర్పుతుంది. భగవంతుడు సర్వులకూ చెందిన వాడు. అయినా అందరూ ఆయనలో లేరు. మనిషి సుఖంగా ఎలా జీవించాలో ధార్మిక సాహిత్యం చెబుతుంది.

వ్యసనాలకు లోనైతే భగవంతుడు అండగా ఉన్నా కష్టాలు పడవలసిందేనని తెలుపుతుంది పాండవుల కథ. ధర్మరాజు అంతటి వాడు కూడా జూదం వల్ల సర్వం కోల్పోయి, అడవులకు వెళ్ళవలసి వచ్చింది. ఇక మనమెంత! ఈ విషయం తెలుసుకుని వ్యసనాలను వదిలిపెట్టాలి. వ్యసనాలతో సంపదలూ, సర్వం కోల్పోతున్నా వివేకజ్ఞానం లేక కష్టాలు పడతారు జనులు. ఈ విషయాన్ని మనం తెలుసుకోవాలి. పాండవులు అడవుల పాలైనా, వారు ఎప్పుడూ నిరుత్సాహ పడలేదు. వారు ధర్మపరులు కనుక, చివరకు దైవ సహాయంతో అధర్మంపై గెలిచి, సుఖ సంతోషాలను పొందారు. కష్టాలు అందరికీ వస్తాయి. వాటిని మనం ఎలా స్వీకరిస్తున్నామన్నదే ముఖ్యం.

కష్టాలు కోతుల లాంటివి. వాటికి భయపడితే మనం సర్వనాశనమవుతాం. వాటిని ఎదుర్కొని ముందుకు వెళ్ళడం నేర్చుకోవాల్సిందని స్వామి వివేకానంద చెబుతారు. ఈ గుణపాఠాన్ని ఆయన స్వయంగా తెలుసుకున్నారు. ఆత్మ విశ్వాసంతో కష్టాలను ఎదుర్కొని, పాండవుల లాగ విజయం సాధించాలి. వేద, పురాణ, ఇతిహాసాల సారాంశాన్ని మన జీవితానికి అన్వయించుకొని, ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలి. లేకపోతే నష్టపోయేది మనమే! "సత్యమేవ జయతే" – ఎన్నటికైనా 'సత్యమే' గెలుస్తుంది. అసత్యం, అబద్ధం, అధర్మం గెలవవు. ఎల్లప్పుడూ సత్యాన్ని అంటిపెట్టుకోవాల్సిందని శ్రీరామకృష్ణుల ఉవాచ. భగవద్ విశ్వాసంతో, శరణాగతితో మనం జీవితంలో విజయ సోపానాలను అధిరోహించాలి.

జి.కె.రామ్, కాకినాడ.

? : మనస్సు, ప్రాణము, జీవుడు గురించి తెలియజేయండి. శరీరం విడిచిన తర్వాత జీవునికి రూపం ఉంటుందా?

✍: 'జీవః ప్రాణ ధారణే' అని శాస్త్రాలు చెబుతున్నాయి. ప్రాణముండటమే జీవునికి ఉనికి. జీవికి ప్రాణం లేకపోతే మరణించినట్లే. 'మనః షష్ఠానీంద్రియాణి...' అని భగవద్గీతలో పరమాత్మ ఉవాచ. మనస్సు సూక్ష్మమైంది. జీవుడు స్థూల శరీరం విడిచిన తర్వాత సూక్ష్మరూపంలో ఉంటాడు. అది మన ఇంద్రియ గోచరం కాదు. కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం, స్పర్శలతో తెలియబడదు. జీవుడు మరలా ఏదో ఒక గర్భంలో పడి జన్మించే వరకూ రూపం తెలియబడదు. ❖

ఆధ్యాత్మిక అహంకారం

– స్వామి విశుద్ధానంద

యుగధర్మం సదా మారుతూనే ఉంటుంది. సత్యయుగం నాటి మనుష్యులది సాత్త్విక స్వభావం. త్రేతాయుగంలో క్షాత్రబలాన్ని తక్కువ చేసి, బ్రహ్మతేజమే గొప్పది అంటూ – ‘ధిక్ బలం క్షత్రియబలం, బ్రహ్మతేజో బలం బలం’ అన్నారు. అర్జునుడు, రావణుడు క్షత్రియ గుణానికి ప్రతీకలు, రజోగుణ సంపన్నులు. బ్రాహ్మణత్వం సంపాదించడానికి విశ్వామిత్రుడు ముప్పై ఏళ్ళు కఠోరసాధన చేశాడు. కులం అన్నది పుట్టుకతో వచ్చిందన్న వసిష్ఠుడు తప్ప ఋషులందరూ, విశ్వామిత్రుడు కృతకృత్యుడయ్యాడు అన్నారు. వసిష్ఠుడు మాత్రం ఒప్పుకోలేదు. క్షత్రియుల్లో ప్రస్ఫుటంగా గోచరించేవి – క్రోధం, హింసా ప్రవృత్తి; బ్రాహ్మణుల ప్రధాన గుణాలు – దయ, క్షమ.

ముప్పై ఏళ్ళ పాటు తపస్సు చేసి, ఏమీ సాధించలేక పోయానే, క్షత్రియుడిగానే మిగిలి ఉన్నానని దిగులు పడ్డాడు విశ్వామిత్రుడు. దాంతో విశ్వామిత్రుడు క్రుద్ధుడయ్యాడు. ఎవరికీ తెలియకుండా వసిష్ఠుణ్ణి చంపాలని నిర్ణయించుకొని, ఒక చీకటి రాత్రి వసిష్ఠాశ్రమం ప్రవేశించాడు. వసిష్ఠుడు సమాధిస్థుడై ఉన్నాడు. సమాధిలో ఉన్న వ్యక్తిని వధించకూడదన్న జ్ఞానం మాత్రం తన దీర్ఘకాల తపస్సు మూలంగా సంపాదించాడు విశ్వామిత్రుడు. కనుక దాగి ఉన్నాడు.



సమాధి నుండి మేల్కొన్న వసిష్ఠుడు, ‘ఆకలి వేస్తున్నది’ అన్నాడు తన పత్ని అరుంధతితో. ఆమె ఒక పండు తెచ్చి ఇచ్చింది. కొద్దిగా ఉప్పు అడిగాడు. ఆశ్రమంలో ఉప్పు లేదన్నది అరుంధతి. ఒక్క క్షణం మౌనం వహించి, ‘విశ్వామిత్రుని ఆశ్రమం దగ్గరలోనే ఉంది కదా! వారిని అడిగి పట్టుకురా!’ అన్నాడు వసిష్ఠుడు. ‘మన వందమంది కుమారులను వధించిన వారి ఎదుట చెయ్యి చాపడమా? నా వల్ల కాదు, క్షమించండి’ అన్నది అరుంధతి. ‘అరుంధతీ! విశ్వామిత్రుడు తపఃఫలితంగా రాజర్షి అయ్యాడు. ఇప్పుడు గతాన్ని తలవడమేల’ అని ప్రశాంతంగా అన్నాడు వసిష్ఠుడు.

వసిష్ఠుని క్షమాపరాయణత చూసి విశ్వామిత్రుడు పశ్చాత్తాపం చెందాడు. ఆయన పాదాలపై పడి క్షమాపణ వేడుకున్నాడు. ‘విశ్వామిత్రా! నీవు నాకు ఏ అపకారమూ చేయలేదు. కానీ నీ మనస్సుకే అపకారం జరిగింది’ అన్నాడు వసిష్ఠుడు. విశ్వామిత్రుడికి కనువిప్పు కలిగింది. ‘నీవు ఆదిశేషుని ఆశ్రయించి, గురూపదేశం అర్థించు’ అన్నాడు వసిష్ఠుడు.

ఆదిశేషుని ఉపదేశ మొసంగమని వేడుకొన్నాడు విశ్వామిత్రుడు. ‘పిచ్చివాడా! నా తలపై మోస్తున్న భూభారంతో నేను సతమతమవుతున్నాను. ఉపదేశం ఏమి చేయగలను?’ అన్నాడు. విశ్వామిత్రుడు తన తపోబలంలో మూడోవంతు ఆదిశేషునికి ఇవ్వగా, ఒక స్తంభం భూమిని ఛేదించుకుని బయటకు వచ్చింది. ఆ స్తంభంపై భూమిని నిలబెట్టి, ఆదిశేషువు ఉపదేశం ప్రారంభించాడు. ఇంతలో ఆ స్తంభం క్రుంగిపోసాగింది. ఆదిశేషువు ఆదరాబాదరాగా పృథ్విని తిరిగి తన శిరస్సులపై పెట్టుకొన్నాడు. విశ్వామిత్రుడు మిగిలిన తపోబలాన్ని ప్రదానం చేశాడు. అయినా ఆ స్తంభం భూభారాన్ని మోయలేక పోయింది.

విశ్వామిత్రుడు తన సమస్త తపోబలం ఉపయోగించి కూడా ఒక స్తంభం క్రుంగకుండా చేయలేక పోయాడు. ఆయన అహంకారం చూర్ణమవుతోంది. అప్పుడు ఆదిశేషుడు, ‘విశ్వామిత్రా! ముప్పై ఏళ్ళ తపస్సుకే ఇంత అహంకారమా’ అని హేళన చేసి, తిరిగి వసిష్ఠుణ్ణి ఆశ్రయించమన్నాడు. వసిష్ఠాశ్రమంలోకి ఈ మారు ఎంతో వినమ్రభావంతో అడుగుపెట్టాడు. ‘రావయ్యా! బ్రహ్మర్షి విశ్వామిత్రా’ అంటూ వసిష్ఠుడు, ఆయనను సాదరంగా ఆహ్వానించాడు. ❖

(స్వామి చేతనానంద బెంగాలీ సంకలనం ‘గొల్పమాలిక’ పుస్తకం నుంచి)

అనువాదం: డాక్టర్ కమల జయరావు

సిక్కుల తొలి గురువు - గురునానక్

కథ: రాజీ రఘునాథన్, హరిహరన్, చిత్రాలు: గోపి అనుసృజన: స్వామి జ్ఞానదానంద

అది క్రీ.శ.1469వ సంవత్సరం. లాహోర్ సమీపంలోని తల్వండి గ్రామం. తదనంతర కాలంలో నాంగనా సాహెబ్‌గా ఖ్యాతి గాంచిన గ్రామం అది. అక్కడ మెహతా కాళియన్‌దాస్ కుమారుడిగా, కార్తీక పౌర్ణమి నాడు గురునానక్ జన్మించాడు.








5
తండ్రికి నానక్ గురించి దిగులు పెరిగింది. వివాహం చేస్తే సమస్య పరిష్కారమవుతుందని తలచి, సులగ్ని అనే కన్యతో వివాహం జరిపించాడు. నానక్‌కు ఇద్దరు కుమారులు జన్మించారు. వివాహానంతరం కూడా నానక్ మారకపోవడంతో తండ్రి, అతణ్ణి వ్యాపారంలో దింపాడు.
6
నానక్ సంత నుంచి బియ్యం, పప్పులు, వస్త్రాలు కొనుగోలు చేసి వస్తుండగా దారిలో పలువురు సాధువులు ఆకలితో అలమటించడం చూసి అతని హృదయం ద్రవించిపోయింది. వెంటనే తన వద్ద ఉన్న సంబారాల నన్నింటినీ వారికి ఇచ్చేశాడు.
7
ఇంటికి రాగానే...
నానక్! నీకేమన్నా పిచ్చి పట్టిందా వస్తువులన్నీ దానం చేశావ్?
లాభం కలిగే వృత్తి చెయ్యమన్నారు కదా! సాధువులకు ఇవ్వడం కన్నా శ్రేష్ఠమైనది మరొకటి ఉందా నాన్నా?
అప్పుడు అక్కడ ఉన్న రాయ్‌భులార్, గురునానక్ మహత్త్వాన్ని గ్రహించి అతడికి ప్రథమ శిష్యుడయ్యాడు.
8
నానక్ దైవోన్మాదంతో పాడడం, ఆడడంలో, ధ్యానంలో సమయాన్నంతా గడపసాగాడు. ఒకరోజు నానక్ సోదరి నానకి, ఆమె భర్త జైరామ్‌తో అక్కడకు రాగా...
నాన్నా! తమ్ముడు దైవాంశసంభూతుడు. ప్రకాశమానమైన ముఖవర్చస్సుతో ఉన్న అతణ్ణి ఇతరుల్లా 'పని చెయ్యి' అని ఎందుకు బలవంతం చేస్తున్నారు?
మామగారూ! దిగులు చెందకండి.
మా ఊరికి తీసుకుపోయి అతణ్ణి మంచి ఉద్యోగంలో కుదురుస్తాను.
ఎలాగో అతడు మంచి దారిలో పడేలా చెయ్యి.
9
నానక్ రోజంతా పనిచేస్తూ రాత్రివేళ మిత్రులతో కలిసి భక్తిగీతాలు పాడుతూ కాలం గడపసాగాడు.

మిగతా 34వ పేజీలో...

త్రికరణశుద్ధి

–స్వామి వినిశ్చలానంద

మనస్సు, వాక్కు, శరీరం – వీటిని త్రికరణాలని అంటారు. త్రికరణ శుద్ధిగా చేసే పని సత్ఫలితాల్ని ఇస్తుంది. అందుకే మనస్సు, వాక్కు శరీరాలను ఎప్పుడూ పరిశుద్ధంగా ఉంచుకోవాలి.

మనస్సు: మనస్సును పరిశుద్ధంగా ఉంచుకోవడానికి ఒకే ఒక్క మార్గం – హరినామ గుణ కీర్తనం. హరి అనే రెండు అక్షరాలు సమస్త పాపాలను హరిస్తాయి. పాప చింతనలు హరించాలంటే హరినామ గుణకీర్తనం ఒక్కటే తరుణోపాయం.

మానసికంగా సదా హరిని శరణుజొచ్చి ఆయన అనుగ్రహానికి పాత్రుడైనవాడిని ఏ గ్రహాల ఆగ్రహాలూ ఏమీ చెయ్యలేవు. చితి కళేబరాలను కాలుస్తుంది. చింత బ్రతికి ఉన్న జీవుడినే దహిస్తుంది. చింత నుంచి దూరంగా ఉంచగలిగేది హరిచింతన మాత్రమే.

నిజానికి మనం పరిశుద్ధాత్ములమే! అయితే అధోగతికి దిగజారిన మన మనస్సును అత్యున్నత స్థితికి కొనిపోవాలి. ఇతర లోహాలతో కలిసిన బంగారాన్ని పుటంబెట్టి ఎలా మేలిమి బంగారంగా మారుస్తామో, ప్రాపంచిక వస్తు విషయంలో కొట్టుమిట్టాడుతూ దుఃస్థితికి దిగజారుతున్న మన మనస్సును పుటంబెట్టి మేలిమి బంగారంగా మార్చి ఆ మనస్సును భగవన్ముఖం చెయ్యగలగాలి.

శుద్ధమైన మనస్సు సాత్త్విక లక్షణంతో కూడుకొని ఉంటుంది. అలాంటి మనస్సుతోనే మనం భగవత్ చింతన చెయ్యాలి. తద్వారా మనస్సుకు అంటిన మలినాలను రూపుమాపగలుగుతాం.

దృశ్యాలన్నీ అదృశ్యాలే. కళ్ళు వెళ్ళే ప్రతి చోటుకూ మనస్సును పోనివ్వకూడదు. మనస్సు స్వభావాన్ని గుర్తెరిగి కదు జాగరూకతతో ఉండాలి. తీగకు పాదు ఎంత అవసరమో, మనస్సు నిలువడానికి ఒక ఆధారం అవసరం. సదా హరినామ చింతనామృత మత్త పానచిత్తుడై ఆయన రూపాన్నే ఆధారంగా గైకొని మనస్సుకు అప్పగించాలి. తద్వారా మనస్సు పరిశుద్ధమవుతుంది.

వాక్కు: వాక్కును శుద్ధి పరుచుకోవడం ఎలా? వాక్కుకు దేవి సరస్వతి. ఆవిడను వాగ్దేవి అని అంటారు. సరస్వతీ దేవిని స్మరించుకొని చికాగోలో స్వామి వివేకానంద చేసిన ప్రసంగం సభాసదులను సమ్మోహితులను చేసింది. ఈశ్వర ప్రేరిత మహావక్తగా ఆయన వాగ్ధాటి, హైందవ ఝంఝామారుతమని అన్ని పత్రికలూ శ్లాఘించాయి. సరళ గంభీర సమన్విత భాషలో అమృతవాక్కులను స్వామీజీ మనకందించారు. సరస్వతీ కటాక్షం స్వామీజీ సొంతం.

వాక్శుద్ధి గలవారు సాధించలేనిదంటూ ఏమీ లేదు. మనం అనుకునే అక్షర జ్ఞానం లేని ఎంతోమంది ఎప్పటికీ క్షరం కాని పదాలను అనగలిగారు, పాడగలిగారు. త్యాగయ్య, అన్నమయ్య, పురందరదాసు, శ్రీరామకృష్ణులు వీరంతా ఏం చదువుకున్నారు? అయితే వారంతా అమృతధారలను మన కందించ లేదా! ఈ జగమంతా రామమయం గానే భావించిన త్యాగయ్య నోట ఆనాడు తారాడిన నాదాలు ఈనాడు కూడా మన పెదాలపై కదలాడుతున్నాయంటే కారణం – వారి పలుకులు అనంతశక్తి నిక్షిప్త జ్ఞాన భాండాగారాలు కావడమే!

శ్రీరామకృష్ణులు జీవించిన 50 ఏళ్ళ కాలంలో ఒక్క క్షణం కూడా వృథా అన్నది లేదు. మన జీవితంలో ఎంత సమయం వృథా కాకుండా గడపగలుగుతున్నాం.

మాస్టర్ మహాశయులు మొదటిసారి శ్రీరామకృష్ణుల దర్శనానికి వచ్చినప్పుడు అక్కడ ఉన్న బృంద అనే పరిచారికను 'శ్రీరామకృష్ణులు ఏమి చదువుకున్నారు'అని అడుగుతారు. 'సాక్షాత్తూ సరస్వతీ దేవే ఆయన నాలుకపై నివసిస్తుంది' అనేది ఆ మహనీయురాలు ఇచ్చిన అద్భుత సమాధానం.

శ్రీరామకృష్ణులు స్వయంగా ఎన్నో సందర్భాలలో ఇలా చెప్పారు – "నేనా మాట్లాడుతున్నది! కాదు, అమ్మ చెబుతున్న దేదో అదే నేను పలుకుతున్నాను" అని. ఆయన ఏదైనా చెప్పవలసి వస్తే "ఉండు! అమ్మను అడిగి వస్తాను"అనే వారు. భవతారిణియే తన ద్వారా మాట్లాడుతున్నదనే నిశ్చితాభిప్రాయం శ్రీరామకృష్ణుల వారిది.

సరళంగా, మృదువుగా, సూత్రప్రాయంగా తియ్యటి పలుకులతో మనం మాట్లాడే ప్రతి మాటా ఇతరులను ఆనందింప చేయగలిగేదిగా ఉంటుంది. ఇంకా వినాలనే కోరికను రేకెత్తించేలా మాట్లాడడానికి చాలా నేర్పు కావాలి. నేర్పు అనేది నేర్చుకుంటే వచ్చేది కాదు. లౌక్యంగా మాట్లాడగలిగే నేర్పు, నేర్పు కాదు. కొద్ది సమయంలోనే వారి నేర్పరితనం బట్టబయలవుతుంది. యథార్థాన్ని ఎరిగి మృదువుగా, మధురంగా చక్కటి శైలిలో తెలియపరచగల సామర్థ్యమే నిజమైన నేర్పరితనం. వశం తప్పి మాట్లాడకూడదు. వశం తప్పి మాట్లాడుతున్నాడనే మాటను మనం సహజంగా వింటూ ఉంటాం. సంస్కృతంలో ఒక ఆర్యోక్తి ఉంది. "సర్వం పరవశం దుఃఖం, సర్వం ఆత్మవశం సుఖం." ఇతర వ్యక్తుల యందు గానీ, ఇతర విషయాల యందు గానీ, ఇతరత్రా మనం వశం అయినప్పుడు గానీ, లేదంటే వాటిని గాంచి పరవశం పొందినప్పుడు గానీ దుఃఖం సంప్రాప్తిస్తుంది. అలా గాక ఆత్మానుగతమై, అంతర్ముఖులమై ఆత్మ వశమైనప్పుడు, లేక పరవశం పొందినప్పుడు సుఖం ప్రాప్తిస్తుంది. కనుక ఎప్పుడూ ఆత్మవశులమై, భగవత్సాన్నిధ్యంలో ఉండి భగవత్సంబంధమైన మాటలను మాట్లాడుతున్నప్పుడు మన చుట్టూ ఉన్నవారికి ఆ సాన్నిధ్యాన్ని అందించగలుగుతాం.

పూర్తిగా భగవదంకితమైన వ్యక్తుల పలుకులు మన మనస్సులకు హత్తుకుంటాయి. వారి వాక్కులే దీవెనలుగా పనిచేస్తాయి. అలాంటి మహాత్ముల వాక్కులు శ్రవణం చెయ్యగల ధన్యాత్ములు నిజంగా ధన్యజీవులు.

త్యాగయ్య లాంటి వాగ్గేయకారుల లాగ హరి చింతనామృత పాన మత్త చిత్తులై సదా హరి నామ గుణగాన విశేషాలను వెదజల్లుతూ, ఎంతో మంది తప్త జీవుల తాపాన్ని తగ్గిస్తూ, కథామృత వర్షిణిలో ఓలలాడిస్తూ, అందరినీ ఆకర్షిస్తూ భగవంతుని వైపు ఆకర్షింపజెయ్యగలిగే వాక్కు అందరికీ సాధ్యమయ్యేది కాదు. శ్రీరామకృష్ణులు చివరి వరకూ తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరినీ తన వాక్కు ద్వారా ఆ అమృత ధారలో ముంచెత్తారు. ఆయన కథామృతాన్ని చదవడం ద్వారా మనమందరమూ ఈ రోజు కూడా ధన్యులం అవుతున్నాం. అదే పరిశుద్ధమైన వాక్కు.

శరీరం : 'శరీరమాద్యం ఖలు ధర్మ సాధనమ్' అన్నారు. శరీరం ఉంటేనే దేన్నైనా సాధించగలుగుతాం. ఈ కట్టె కాలిపోవడానికి ముందే పరమార్థాన్ని చేరుకోవడానికి ప్రయత్నించాలి. శరీరమనేది ఒక అద్భుత సాధనం. మనమందరమూ భగవంతుని చేతిలో పరికరాల్లాంటి వారం.

అహంకార శూన్యులమై ఆయన చేతిలో ఒదిగి ఉంటూ ఆయన మన ద్వారా ఏ పనిని నిర్వర్తించాలని సంకల్పిస్తారో ఆ పనిని ఆయన పనిగా నెంచి, ఆయన కోసం మనం సాఫల్యంతో చెయ్యగలగడమే మనందరి కర్తవ్యం.

శ్రీరామకృష్ణుని చేతిలో సాధనంగా ఉంటూ స్వామీజీ పనిని మనం విజయవంతంగా చెయ్యగలిగిననాడు శ్రీశారదాదేవి కృపకు పాత్రులం కాగలుగుతాం.

ఆ ఉద్దేశంతో మనం శరీరాన్ని పోషించుకుంటూ పరిశుద్ధంగా ఉండే ప్రయత్నం చెయ్యాలి. బలమే జీవనం. బలహీనతే మరణం అన్నారు స్వామీజీ. 'తిండి కలిగితే కండ గలదోయ్, కండ కలవాడేను మనిషోయ్' అన్నారు గురజాడ.

కనుక తిండి పుష్టి, కండ పుష్టి – రెండూ కావాలి. ఉక్కు నరాలు, ఇనుప కండరాలు ఉన్న యువతరాన్ని ఆశించారు స్వామీజీ. కాబట్టి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, అభ్యాస యోగం ద్వారా పరిశ్రమిస్తూ, సాధనాబలంతో ప్రయత్న పూర్వకంగా మన లక్ష్యసాధనకు ప్రయత్నించాలి. అలాంటి అంకిత భావం కలిగి, శ్రీరామకృష్ణులు ఉపదేశించిన మార్గంలో పునరంకితులను చెయ్యవలసిందిగా త్రికరణ శుద్ధిగా మనం ప్రార్థిద్దాం. ❖

www.rkmath.org Free Soft Copy Ramakrishna Math Hyderabad

ఓ మహాత్యాగి ఆత్మకథ

(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

(మహా భక్తుడు, అద్వైత వేదాంతి, కర్మయోగి, మహా ప్రవక్త, శ్రేష్ఠసన్న్యాసి, గురువు, యుగాచార్యుడు, పరమహంస శిష్యుడు, మానవ జాతి ప్రేమికుడు, మహా దేశభక్తుడు, ధ్యానసిద్ధుడు, మహాయోగి, గంధర్వగాయకుడు - ఇలా విభిన్న రూపాలలో స్వామి వివేకానంద మనకు దర్శనమిస్తారు. స్వామీజీ తన సంభాషణలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, లేఖల్లో స్వయంగా తెలిపిన జీవితానుభవాలను 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.)

(...గత సంచిక తరువాయి)

'విగ్రహారాధన మంచిది కాదు' అనడం ఈనాడు సర్వసాధారణమైపోయింది. నేనూ ఒకప్పుడు అలాగే అనుకున్నాను. కానీ, దానికి తగిన శిక్షగా విగ్రహారాధన ద్వారానే సర్వమూ సాక్షాత్కరించుకొన్న ఒక పూజారి పాదాల దగ్గర కూర్చొని పాఠాలు నేర్చుకోవలసి వచ్చింది. ఆ వ్యక్తే - శ్రీరామకృష్ణ పరమహంస. విగ్రహారాధన ద్వారా అలాంటి శ్రీరామకృష్ణ పరమహంసలు ఉద్భవిస్తే, మనకు కావలసింది ఏమిటి? సంఘ సంస్కర్తల ఊకదంపుడు ఉపన్యాసాలా, లేక అసంఖ్యాక విగ్రహాలా? ...విగ్రహారాధన ద్వారా శ్రీరామకృష్ణ పరమహంస లాంటి మహాత్ముల్ని సృష్టించగలిగితే, ఒక్కటి కాదు ఇంకొక వెయ్యి విగ్రహాలు తీసుకొని రండి.

విగ్రహారాధన సాధనలో ఎన్నో అవకతవకలున్నా, దానిని నేను నిరసించను. ఔను సోదరా! 'పాతకాలం మనిషి, విగ్రహారాధకుడు' అయిన ఆ బ్రాహ్మణుడి (శ్రీరామకృష్ణుల) పవిత్ర పాదధూళితో పునీతుడను కాకపోయి ఉంటే, నేనెక్కడ ఉండేవాడినో కదా!

మా గురుదేవులు అస్వస్థులైనప్పుడు, ఆయన తన అద్భుతమైన మానసిక (ఇచ్ఛా) శక్తిని ప్రయోగించి, తన వ్యాధిని నయం చేసుకోవచ్చునని ఒక బ్రాహ్మణుడు సలహా ఇచ్చాడు. శరీరంలోని వ్యాధిగ్రస్థమైన భాగం (గొంతు) పై ఆయన తన మనస్సును ఏకాగ్రం చేస్తే చాలు, అది నయమైపోతుందని అతనన్నాడు. అందుకు శ్రీరామకృష్ణులిలా బదులిచ్చారు - "ఏమిటి! భగవంతునికి సమర్పించిన మనస్సును, తుచ్ఛమైన శరీరం కోసమై క్రిందికి తీసుకురావడమా?" శ్రీరామకృష్ణులు తన శరీరం గురించి గానీ, వ్యాధి గురించి గానీ ఆలోచించడానికి కూడా నిరాకరించారు! వారి మనస్సు సదా, సర్వదా భగవంతుని చైతన్యంలో లీనమై ఉండేది. ఆ మనస్సు భగవంతునికే సంపూర్ణంగా అంకితమై పోయింది. దాన్ని మరి ఏ ఇతర ప్రయోజనాల కోసం ఆయన ఉపయోగించ లేక పోయేవారు.

శ్రీరామకృష్ణుల మహాసమాధికి రెండు, మూడు రోజుల ముందు - ఎవరినైతే ఆయన 'కాళీ' అనేవారో, ఆ కాళీమాత ఈ (నా) శరీరంలో ప్రవేశించింది. నన్ను ఊరకే ఉండ నివ్వకుండా, నా వ్యక్తిగత సుఖసంతోషాల్ని చూసుకోనివ్వ కుండా ఆ 'కాళీమాత'యే నన్ను నానా ప్రదేశాలకు తీసుకువెళుతూ, నాతో పని చేయిస్తున్నది.

ప్రశ్న: మీరు భావుకంగా మాట్లాడుతున్నారా?

ఓహ్! లేదు, లేదు; శ్రీరామకృష్ణులు తమ శరీరాన్ని విడిచిపెట్టడానికి రెండు, మూడు రోజుల ముందు, నన్ను వారి దగ్గరకు రమ్మని పిలిచారు; తనకెదురుగా కూర్చోమని చెప్పి, నా వైపే ఏకాగ్రదృష్టితో చూస్తూ సమాధి మగ్నులయ్యారు. ఆ సమయంలో విద్యుత్ ప్రకంపనం లాంటి ఒక అనిర్వచనీయ, సూక్ష్మమైన శక్తి నాలోకి ప్రవేశిస్తుండడం స్పష్టంగా, నిజంగా అనుభూతి చెందాను; కొద్దిసేపట్లో నేను కూడా బాహ్య స్పృహ కోల్పోయి, నిశ్చలంగా కూర్చుండి పోయాను. అలా ఎంతసేపు ఆ స్థితిలో ఉన్నానో నాకు గుర్తు లేదు; బాహ్య చైతన్యం తిరిగి వచ్చాక, శ్రీరామకృష్ణులు కన్నీరు కారుస్తూ ఉండడం చూశాను! ఎందుకని ప్రశ్నించగా, ఆయన ఆప్యాయంగా ఇలా బదులిచ్చారు:

"ఓ నరేన్! ఈ రోజు నా సర్వస్వమూ నీకు ధారపోసి నేనొక భిక్షగాడినయ్యాను. ఈ ఆధ్యాత్మిక శక్తితో విశ్వశ్రేయస్సు కోసం నీవు ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉంది; ఆ పని ముగించిన తర్వాత నీవు నీ స్వధామానికి తిరిగి చేరుతావు". ఆ శక్తే నన్ను ఈ పనీ, ఆ పనీ చేయడానికి నిరంతరం ప్రేరేపిస్తోంది. ఈ శరీరం ఊరకే కూర్చోవడానికై సృష్టించ బడలేదు!

ప్రశ్న: శ్రీరామకృష్ణులు స్వయంగా తమ నోటితో 'నేను భగవంతుణ్ణి' అనీ, 'పరిపూర్ణ బ్రహ్మం' అనీ ఎప్పుడైనా అన్నారా?

ఔను. మా అందరితోనూ చాలాసార్లు అన్నారు. ఆయన కాశీపూర్ ఉద్యాన గృహంలో నివసిస్తున్నప్పుడు, వారి శరీరం శాశ్వతంగా రాలిపోతుందనే ప్రమాదకరమైన స్థితిలో ఉండగా – ఒకరోజు ఆయన మంచం ప్రక్కన నిలబడి (శ్రీరామకృష్ణుల మహాసమాధికి కేవలం రెండు రోజుల ముందు) నా మనస్సులో "సరే! ఈ దుర్భర వేదనా స్థితిలో కూడా మీరు 'నేను భగవంతుణ్ణి' అనగలిగితే, అప్పుడే మీరు నిజంగా సాక్షాత్తూ భగవంతుడేనని నేను నమ్ముతాను" అని అనుకున్నాను. తక్షణమే గురుదేవులు నా వైపు కళ్ళెత్తి చూసి, హఠాత్తుగా ఇలా అన్నారు : "ఎవరైతే రాముడో, ఎవరైతే కృష్ణుడో – స్వయంగా వారే ఇప్పుడు ఈ శరీరంలో 'రామకృష్ణులు'గా అవతరించారు. అదీ కేవలం నీ వేదాంత దృష్టితో మాత్రమే కాదు!" (ఎందుకంటే – వేదాంత దృష్టిలో ప్రతి వ్యక్తీ ప్రతి ఆత్మా స్వయంగా భగవంతుడే, అవతార పురుషుడే! 'తత్ త్వమ్ అసి' – 'ఆ పరబ్రహ్మం లేదా పరమాత్ముడు' నీవే అయి ఉన్నావు...) అది విని నా నోట మాట రాలేదు! స్వయంగా మా ప్రభువు పవిత్రమైన ముఖతః మాటి మాటికీ విన్నప్పటికీ, మాకు కూడా అంతవరకూ పరిపూర్ణ విశ్వాసం కలుగలేదు. అప్పుడప్పుడూ మా మనస్సులు సంశయం, నిరాశలతో ఊగిసలాడుతూ ఉంటాయే!

ఈ ప్రపంచంలో, ఈ మహాత్ముడు ఈ యుగంలో జాజ్వల్యమానంగా వెలుగుతున్న జ్యోతిస్తూపం లాంటి వాడు; ఆ జగద్గురువు ద్వారానే, నేటి మానవుడు సంసార సాగరాన్ని దాటగలడు.

ఆయన తన జీవితంలో ఎన్నడూ నా ఒక్క ప్రార్థన కూడా తిరస్కరించలేదు; నా లక్షలాది దోషాలను ఆయన క్షమించారు! నా మీద అలాంటి ప్రేమ, విశ్వాసం మా తల్లితండ్రులు కూడా ఎన్నడూ చూపలేదు; ఇందులో కవిత్వం కానీ, అతిశయోక్తి కానీ ఏమీ లేదు. ఇది ఒక నగ్న సత్యం. ఆయన శిష్యులందరికీ తెలిసిన నిజం కూడా!

ఇక మందబుద్ధులైన ఇతరులను గురించి ఏం చెప్పాలి? మనలాగే శరీరం కలిగి ఉన్న ఒక మనిషిని, 'సాక్షాత్తూ భగవంతుడు' అని ప్రకటించడం, విశ్వసించడమూ నిజంగా చాలా క్లిష్టమైన విషయమే! మహా అయితే మనం ఆయనను ఒక 'పరిపూర్ణుడు' అనో లేదా 'బ్రహ్మజ్ఞాని' అనో అనవచ్చు... అయినా, మీరు ఆయనను గురించి 'ఒక మహాత్ముడు', లేదా 'ఓ బ్రహ్మజ్ఞాని' లేదా ఎలా పిలిచినా, ఎలా అనుకున్నా అదేమంత పెద్ద విషయం కాదు. కానీ నేను ఘంటాపథంగా చెబుతున్నాను వినండి. శ్రీరామకృష్ణుల వంటి సర్వవిధాలా పరిపూర్ణుడైన వ్యక్తి ఈ భూమండలంపై ఇంతవరకూ జన్మించలేదు. అజ్ఞాన అంధకారంలో మునిగిన మహా ఆపదలలో, విపరీత ప్రలోభాలలో "హే భగవాన్! నన్ను రక్షించు" అని దీనాతిదీనంగా విలపించి ప్రార్థించాను; కానీ ఎవ్వరి నుండీ ఏ స్పందనా రాలేదు. కానీ ఈ మహాత్ముడు, లేదా అవతార పురుషుడు, లేదా ఆయన వేరే ఏమైనా అయ్యుండనీ, మనిషి హృదయాంతరాళంలోకి చూడగలిగే తన ఆధ్యాత్మిక శక్తి ద్వారా, నా కష్టాల నన్నింటినీ తెలుసుకుని, నేను కోరకపోయినా నన్ను తమ సన్నిధికి రప్పించుకున్నారు; నా కష్టాలనన్నింటినీ దూరం చేశారు. ఈ ప్రపంచంలో ఒక 'అహేతుక కృపాసింధువు'గా శ్రీరామకృష్ణుల నొక్కరినే కనుగొన్నాను. ❖ (సశేషం)

అనుసృజన : స్వామి అర్చనానంద

మానవ జన్మ సార్థకత!

– ఆకెళ్ల రాఘవేంద్ర

మనమందరం గొప్పగా జీవించడం గురించి ఆలోచిస్తాం. కానీ నిజానికి ఆలోచించాల్సింది, అర్థం చేసుకోవాల్సింది – గొప్పగా మరణించడం గురించి! మనమంతా ఎప్పుడూ మరణం గురించి భయపడుతూవుంటాం. కానీ వాస్తవానికి జీవితం గురించి, ఉన్నతంగా బతకడం గురించి, జన్మను సార్థకం చేసుకోవడం గురించి, జీవితాన్ని ఫలవంతం చేసుకోవడం గురించి భయపడాలి. ఈ చిన్న జీవితాన్ని అర్థవంతంగా ఎలా చేసుకోవాలో, మనం బతుకుతూ ఇతరులను బతక నివ్వడమెలాగో తెలుసు కోవాలి.

విశేషమేమిటంటే–మన ప్రాచీన భారతీయ గాథలన్నీ మానవ జీవన వికాసం ఎలా ఉండాలో వివరించేవే. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు... ఇలా ఒకటేమిటి ప్రతీదీ మనిషి మనిషిగా బతకడమెలాగో ప్రతి మాట ద్వారా, ప్రతి ఘట్టం ద్వారా, ప్రతి పాత్ర ద్వారా వివరించాయి. మనిషి బతకడానికి డబ్బు కావాలి, మనిషి తన కోరికలూ తీర్చుకోవాలి. ఎటొచ్చీ వీటి విషయంలో ధర్మాధర్మ విచక్షణతో వ్యవహరిస్తూ బాధ్యతల్ని నెరవేర్చి, మానవ కల్యాణం కోసం జీవించాలి.

మహాభాగవతంలో ఆరవ స్కంధంలో చిత్రకేతోపాఖ్యానం అనే కథ ఉంది. చిత్రకేతువు అనే మహారాజు మహా బలవంతుడు, ధనవంతుడు, విశాల రాజ్యం కలిగినవాడు. ఆయనకు చాలామంది భార్యలున్నారు. కానీ ఆ రాజుకి పిల్లలు లేరు. సంతానం లేదన్న చింతతో ఆ రాజు రోజురోజుకీ ఎండాకాలం చెరువులా క్షీణించి పోసాగాడు.

అలాంటి బాధాతప్తుడయిన చిత్రకేతు మహారాజు దగ్గరకు ఓ రోజు అంగిరసుడనే మునీశ్వరుడు వచ్చాడు. విషయం తెలుసుకొన్నాడు. పుత్రకామేష్టి యాగం చేయమని సూచించాడు. ఆ రాజు అలానే చేశాడు. ఆ యజ్ఞశేషాన్ని తన పెద్ద భార్య కృతద్యుతికి అందించాడు. కృతద్యుతి గర్భం ధరించి నవమాసాల తర్వాత ఒక కొడుకుని కన్నది.

సంతానం కలగడంతో రాజు, రాణి – ఇద్దరి ఆనందానికి అవధుల్లేవు. కొడుకు మీద తీవ్రమైన ప్రేమాభిమానాలతో రాజు తన ఇతర భార్యల్ని పట్టించుకోవడం మానేశాడు. దాంతో వారిలోని కుటిలత్వం, క్రూరత్వం బయటకొచ్చాయి. దరిమిలా ఒకానొక రోజున ఎవ్వరూ చూడకుండా ఆ సవతులంతా రాకుమారుడికి విషప్రయోగం చేశారు. పిల్లవాడు నిద్రించిన వాడు నిద్రించినట్లే మరణించాడు.

లేకలేక కలిగిన ఏకైక కుమారుడు, చక్కగా పెరిగి పెద్దవుతున్నవాడు, వంశోద్ధారకుడు... అలా నిర్జీవంగా పడి ఉండడం చిత్రకేతు మహారాజుని, కృతద్యుతిని తీవ్రంగా బాధించింది. వారు విలవిలా ఏడుస్తుండడంతో అంగిరస మహాముని విచ్చేశారు. మరణించిన కొడుకు కాళ్ళదగ్గర నిశ్చేష్టుడై విలపిస్తూ కూచొని ఉన్న రాజుతో ముని పలికిన మాటలు– మరణం గురించి మానవుడు ఎలా ఆలోచించాలో బోధిస్తాయి.

"ఓ మహారాజా! నదిలో ప్రవాహవేగానికి ఇసుక రేణువులు కొట్టుకొని పోతుంటాయి. అవి అక్కడక్కడా కుప్పలు కుప్పలుగా కలుస్తుంటాయి, మళ్ళీ చెదిరిపోతుంటాయి. అట్లే– ప్రాణులు కాలప్రవాహంలో కలుస్తూ విడిపోతూ ఉంటారు, పుడుతూ చస్తూ మళ్ళీ పుడుతూ ఉంటారు. నేను, నీవు ఇంకా ఇక్కడ

ఉన్నవారంతా ఇప్పుడు... ఈ క్షణంలో కలిసి జీవించి ఉన్నాం. కానీ భవిష్యత్‌లో మృత్యువు కబళించి వేస్తుంది. ఇప్పుడు కలిసి ఉన్నవాళ్ళం అప్పుడు కలిసి ఉండం. చిన్న పిల్లవాడు బొమ్మలతో ఆడుకొంటూ... ఆడుకొంటూ... అంతలోనే వాటిని వదిలిపెట్టి వేరే ఆటలోకి జారిపోతాడు. అలాగే... మానవ జీవితమంతా ఆటే!"

ఈ మాటల్ని వింటే మనందరికీ ఒక సందేహం వస్తుంది. ఎలాగూ మరణం తప్పదు కాబట్టి ఇక చదువెందుకు, ధనం సంపాదించడం ఎందుకు, అసలు పుట్టడమే ఎందుకు, అని అనిపిస్తుంది. కానీ మరణం గురించిన రహస్యాన్ని... అసలు సత్యాన్ని తెలుసుకొంటే... ఈ నేల మీదకు మనం శాశ్వతంగా ఉండడానికి రాలేదనీ, వెళ్తూవెళ్తూ కనీసం ఒక్క గుండు సూదినైనా పట్టుకుపోలేమనీ, ఉన్నంతలో ఈ జీవితాన్ని సార్థకం చేసుకొనే దిశగా పయనిస్తామనీ, అనవసర వివాదాలు, రాగద్వేషాలు, సంకుచిత స్వార్థాలు ఉండవనీ, మనం వెలుగుతూ ఇతరులకు వెలుగునిస్తూ జీవించడం ఎలాగో నేర్చుకొంటామనీ అర్థమవుతుంది.

అందుకే స్వామి వివేకానంద "ఎల్లప్పుడూ మృత్యువును ధ్యానించండి" అన్నారు. ఆయన ఏమన్నారో ఒక్కసారి తెలుసుకొందాం– "చూడండి! మనమందరం చనిపోవలసిందే! ఈ విషయాన్ని ఎల్లప్పుడూ మనస్సులో ఉంచుకోండి. అప్పుడు మీలో ఉన్న ఆత్మ మేలుకొంటుంది. అప్పుడు మాత్రమే మీలో ఉన్న నీచమైన స్వభావం తొలగిపోతుంది. మాటల కంటే చేతలలో చూపడం అలవడుతుంది. మీ మనస్సులోనూ, శరీరంలోనూ కొత్త తేజస్సు ఆవిర్భవిస్తుంది".

అర్థమైంది కదా!

పూలు ఎక్కడున్నా సువాసన వ్యాపించినట్లు – మనం ఎక్కడ ఉన్నా మన వ్యక్తిత్వం పరిమళిస్తూ ఉండాలి. మన మాట, మన ప్రవర్తన, మన పనులు అన్నీ సువాసన సంభరితంగా ఉండాలి. ఇంట్లో ఉన్నా, ఆఫీసులో ఉన్నా, ప్రయాణంలో ఉన్నా, రోడ్డుపై నడుస్తున్నా, తరగతి గదిలో కూచొన్నా, మన కింద పని చేస్తున్న వారికి ఆజ్ఞలు ఇస్తున్నా, మనపై అధికారుల ఆజ్ఞల్ని వింటున్నా... అసలు మనం ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా – బతికి ఉన్నంత కాలం... తోటివారు మన గురించి, మన వ్యక్తిత్వం గురించి, మన విశాల హృదయం గురించి 'భేష్' అనుకోవాలి. అలా ప్రవర్తించాలి.

గర్వం లేకుండా, ఇతరులను హీనంగా చూడకుండా నలుగురికీ తలలో నాలుకలా... నలుగురితో కలగలిసి పోతూ... ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ... మన కర్తవ్య నిర్వహణ చేస్తూ... ముందుకు సాగడమే మానవ జీవిత సార్థకత అంటే! కమ్మని మామిడి చిగుళ్ళు తినే కోకిలకు ఏ మిడిసిపాటూ ఉండదు. కానీ బురదనీళ్ళు తాగే కప్ప మాత్రం బెకబెకమంటూ ఒకటే గొడవ చేస్తుంది.

"కాకః కృష్ణః పికః కృష్ణః, కో భేదః పిక కాకయోః
వసంతకాలే సంప్రాప్తే, కాకః కాకః పికః పికః"

అంటే – 'కాకి నల్లగా ఉంటుంది. మరి కోకిల? అది కూడా నల్లగానే ఉంటుంది. మరి ఏమిటి రెండింటికి తేడా? వసంతకాలం రానీయండి అవి రెండూ గొంతు విప్పితే – కాకి కాకేనని, కోకిల కోకిలేనని తెలిపోతుంది!

అదే విధంగా – మనమంతా... మనుష్యులమంతా... పైకి ఒక్కలాగే ఉంటాం. కానీ కాలం గడిచేకొద్దీ... పుట్టి పెరిగే కొద్దీ... పెరిగి ఎదిగే కొద్దీ మరణం సమీపించే కొద్దీ... మనం సుమధుర సంగీతాన్ని అందించామా, బెకబెకమంటూ అరుస్తున్నామా... అన్నది మనమే తేల్చుకోవాలి.

ఏమి కొంచు వచ్చునేమి తాఁ గొనిపోవు
పుట్టువేళ నరుడు గిట్టువేళ
ధనము లెచటికేఁగుఁ దానేఁగు నెచటికి?
విశ్వదాభిరామ వినురవేమ!

ఒకసారి ఒక కొంగా, హంసా మాట్లాడుకుంటున్నాయి. హంసను చూసి కొంగ ఇలా అడిగింది:

"కళ్ళు, కాళ్ళు, ముక్కు ఎర్రగా ఉన్నాయ్ ఎవరోయ్ నువ్వు?"

"నేను హంసను"

"ఎక్కడి నుండి వస్తున్నావు"

"మానససరోవరం నుంచి"

"అక్కడ ఏమేం ఉంటాయేమిటి?"

"స్వర్ణ కమలాలు, అమృతం, రత్నాలు, పారిజాతాలు... ఇంకా ఎన్నో మనోహరమైనవి, లోకానికి ఉపకరించేవి ఉంటాయి"

"ఇంతేనా! నత్తగుల్లలు ఉండవా?"

"ఉండవు" అందట హంస

అది విన్న కొంగ వేళాకోళంగా నవ్వుకొంటూ వెళ్ళిపోయిందట.

ఇప్పుడు మనకు మనమే నిర్ధారించుకోవాలి– హంసలా బతకాలనుకొంటున్నామా? కొంగలా ఇతరుల్ని వేళాకోళమాడి.. నత్తగుల్లలే గొప్పవని భ్రమపడాలనుకొంటున్నామా! ❖

యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

రమాదేవి, హైదరాబాద్.

ప్రశ్న : నేను గతంలో ఎన్నో చేదు అనుభవాలను చవిచూచాను. వాటి గురించి ఆలోచిస్తూ నాలో నేను కుమిలి పోతున్నాను. 'శ్రీరామకృష్ణ ప్రభ' చదివినంతసేపూ ఎంతో ధైర్యం వస్తుంది. కానీ తరువాత సదా మామూలే! నేను ఈ విషయాలను స్నేహితులతో చెప్పుకోవాలంటే నాకు ఆత్మాభిమానం అడ్డు వస్తోంది ఈ పరిస్థితుల నుండి బయటపడే మార్గాన్ని తెలపండి.

జవాబు : మన సమస్యలన్నింటికీ ముఖ్యకారణం మనస్సు వర్తమానంలో ఉండక పోవడమే! గతాన్ని తలుచుకుంటూ బాధపడడం, భవిష్యత్తు గురించి ఆందోళన చెందడం మనస్సు స్వభావం. గతంలోని చేదు అనుభవాలను పూడ్చిపెట్టి, భవిష్యత్తు గురించి ఆలోచనల్ని అరికట్టినప్పుడు మాత్రమే ప్రస్తుత పరిస్థితుల్ని తీర్చిదిద్దుకోవడం సాధ్యమవుతుంది.

ఈ సమస్యను మూడు మార్గాలను అనుసరించడం ద్వారా పరిష్కరించుకోవచ్చు.

1. భగవంతునితో మొరపెట్టుకోవడం : ఒక్కసారి భగవద్భక్తుల జీవితాల్ని తరచి చూస్తే వారంతా ఎన్ని కష్టాల్ని అనుభవించారో మనకు అర్థమవుతుంది. ఆ మహాభక్తులు అనుభవించిన కష్టాలు మేరు పర్వతమంతైతే మన కష్టాల్ని ఆవగింజతో పోల్చవచ్చు. కానీ మనకు కలిగిన ఆవగింజంత కష్టానికే అవధుల్లేని అశాంతికి లోనవుతుంటాం. మరి వారు మేరుపర్వతమంత కష్టాల్ని సైతం అవలీలగా ఎలా దాటగలిగారు? తమ బాధలను భగవంతునితో మొరపెట్టుకోవడం వల్లనే అది సాధ్యమయిందని నిరూపించారు సఖుబాయి, జనాబాయి, మీరాబాయి, ముక్తాబాయి, కాన్హోపాత్ర లాంటి అనేక మంది భక్త శిరోమణులు.

It is difficult to live without someone to whom we can open our hearts. But to whom can we better disclose them than to God! *- Thomas A. Kempis*

ఈ ప్రపంచంలో మనల్ని నిస్వార్థంగా ప్రేమించే తల్లి,తండ్రి, బంధువు, మిత్రుడు, శ్రేయోభిలాషి అన్నీ ఆ భగవంతుడు మాత్రమే! కాబట్టి మన బాధలను భగవంతుని వద్ద విలపిస్తూ విన్నవించుకుంటే మేరు పర్వతమంత కష్టమైనా దూదిపింజలా ఎగిరిపోతుంది. 'వ్యాకుల మనస్సుతో భగవంతుణ్ణి ప్రార్థిస్తే ఆయన మన ప్రార్థనల్ని తప్పక వింటాడు' అని శ్రీరామకృష్ణ పరమహంస అనుభవపూర్వకంగా చెప్పారు. ఈ మార్గాన్ని అనుసరించడం కష్టమైనప్పటికీ ప్రయత్నిస్తే అసాధ్యం మాత్రం కాదు!

2. స్నేహితులతో మనస్సు విప్పి మాట్లాడడం : మనోవ్యధలను తొలగించేందుకు ఔషధంలా ఉపయోగపడే వారు మంచి స్నేహితులు.

No medicine is more valuable, none more efficacious, none better suited to be cure of all our miseries than a friend *- St. Aleredx*

మన బాధలను స్నేహితులతో చెప్పుకోవడానికి ఆత్మాభిమానం అడ్డువస్తోందని అనుకోవడానికి కారణం స్నేహితుడు, మనం వేర్వేరు అనే భేద భావం ఉండడం వల్లనే! 'నిజమైన స్నేహితుడు ఇద్దరిలో ఉన్న ఒకే ఆత్మ' – A true friend is one soul in two bodies *- Aristotle*

కాబట్టి బాధలను తలచుకుంటూ కుమిలి పోవడం కన్నా స్నేహితులతో మనస్సువిప్పి మాట్లాడడం వల్ల మనస్సు తేలికపడుతుంది.

3. కార్యకలాపాల్లో మనస్సును నిమగ్నం చేయడం : వీలైనంత వరకూ ఒంటరిగా ఉండకుండా నలుగురితో కలిసిమెలిసి ఉండడం, ఏదో ఒక పనిలో మనస్సును నిమగ్నం చేయడం వల్ల గతాన్ని మరిచిపోవడం సాధ్యమవుతుంది.

స్వామి వివేకానందుని పాశ్చాత్య శిష్యురాలైన మేడం ఈ. కాల్వే మనోవేదనకు గురైనప్పుడు ఆమెను ఓదారుస్తూ స్వామీజీ ఇలా అన్నారు : "నువ్వు గతాన్ని మరిచిపో. నీ దుఃఖాలను గురించి మౌనంగా తలపోస్తూ కూర్చోవద్దు. నీలోని భావోద్వేగాలను ఏదో ఒక బాహ్యరూపంలో సృజనాత్మకంగా వ్యక్తీకరించే ప్రయత్నం చెయ్యి". స్వామీజీ సలహాను పాటించిన ఆమె జీవితం ప్రశాంతమయమైంది.

ఈ మూడు మార్గాల్లో ఏ ఒక్క మార్గాన్ని అవలంబించినా మనస్సు గతంలోనికి అడుగుపెట్టదు. పట్టుదలతో ప్రయత్నిస్తేనే ఏదైనా సాధ్యమవుతుందన్న విషయాన్ని మాత్రం మరువ కూడదు. ❖

మీ సందేహాల్ని పంపాల్సిన చిరునామా :

యువవాణి

శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,

దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029

ఆచరణతో ప్రగతి పథం వైపు...

– స్వామి సేవ్యానంద

మనమంతా జీవితంలో పురోగతి చెందాలనుకున్నా కొద్ది మంది మాత్రమే లక్ష్యాన్ని చేరుతారు. దీనికి ముఖ్య కారణం ఏమిటి? మన మనస్సులో అనుకున్నది, మాటల్లో చెప్పేది – చేతల్లో చెయ్యకపోవడమే! మనం రోజూ ఎన్నో ప్రణాళికలు వేస్తాం. అయితే, ఆచరణ విషయంలో మాత్రం ఎప్పుడూ వెనకడుగు వేస్తుంటాం. మనం అనుకున్న ప్రణాళికలలో కొన్నింటినైనా ఆచరణలో పెట్టినట్లయితే మనం జీవితంలో తప్పకుండా విజయవంతం కాగలం.

విద్యార్థిగా మొదటి అడుగు: 'విద్యా వినయ సంపన్నే' అన్నారు పెద్దలు. నేడు చాలా మందిలో విద్యార్హతలతో పాటు వినయం పెరగడం లేదు. సరి కదా, అహంకారం మాత్రం అంతు లేకుండా పెరుగుతోంది.

విద్యార్థిగా మొదటి అడుగు వేసినప్పుడు అందరూ ఎన్నో ఆశలతో, ఎన్నెన్నో ఆశయాలతో జీవితాన్ని ఆరంభిస్తారు. కొంత సమయం గడిచాక ఒకవైపు తల్లితండ్రుల ఒత్తిడి, మరొకవైపు ఉపాధ్యాయుల ఒత్తిడి, ఇంకొంచెం దూరంలో పరీక్షల ఒత్తిడి – ఇవన్నీ కలిసి మీద పడడంతో ఏం చెయ్యాలో తెలియక అయోమయ స్థితిలో పడుతున్నాడు నేటి విద్యార్థి. ఫలితంగా విద్యార్థులు చదువుకోవడానికి సరైన ప్రణాళికలు వేసుకోలేక, వేసిన ప్రణాళికలను అనుసరించలేక మానసిక ఆందోళనలకూ, మానసిక వ్యాధులకూ గురవుతున్నారు, ఇంకా ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు.

వీటన్నిటికీ ముఖ్యకారణం మనం 'విద్య' యొక్క ప్రధాన లక్ష్యాన్ని మరిచిపోవడమే! 'విద్య'ను కేవలం డబ్బులనిచ్చే యంత్రంగా భావించడమే! మనం 'విద్య' ద్వారా బాహ్య పురోగతితో పాటు అంతరంగ పురోగతి కోసం ప్రయత్నించాలి. అప్పుడే మనలో మంచి శీలం, వ్యక్తిత్వం అలవడి, ప్రగతిని సాధించగలం.

పాండిత్యం కన్నా వివేచన మిన్న! : మనం అంతరంగ పురోగతిని సాధించాలంటే తరగతి పుస్తకాలతో పాటు ఆధ్యాత్మిక పుస్తకాలను కూడా చదవడం తప్పనిసరి. అయితే వాటిలో ఉన్న ఉన్నత ఆదర్శాలను మన జీవితంలో ఆచరించనట్లయితే ఎన్ని పుస్తకాలను చదివినా ఏం ప్రయోజనం! "ఒక గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలన్నింటినీ కంఠస్థం చేసిన వాడి కన్నా ఒక్క ఉపదేశాన్ని తన జీవితంలో ఆచరించిన వాడే చాలా రెట్లు గొప్పవాడు" అని స్వామి వివేకానంద చెప్పారు.

ఈ విషయం శ్రీరామకృష్ణులు చెప్పిన ఒక కథ ద్వారా మరింత స్పష్టమవుతుంది.

"ఒక పండితుడు రాజు దగ్గరకు వెళ్ళి, భాగవతం చెబుతానన్నాడు. సమాధానంగా రాజు, 'భాగవతాన్ని ముందు మీరు అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి' అన్నాడు. నిరాశ చెందిన ఆ పండితుడు, 'ఈ రాజు ఎంత మూర్ఖుడు! నా లాంటి మేధావికి భాగవతం అర్థం కాలేదంటున్నాడు' అని మనస్సులో అనుకొని తిరిగి వెళ్ళిపోయాడు.

కొన్ని రోజుల తరువాత ఆ బ్రాహ్మణుడు, రాజు దగ్గరకు మళ్ళీ వెళ్ళి తన ఆకాంక్షను తెలియజేశాడు. రాజు కూడా మళ్ళీ మునుపటి సమాధానమే చెప్పాడు. ఈసారి బ్రాహ్మణుడు, రాజు చెప్పిన విషయాన్ని గంభీరంగా ఆలోచించడం మొదలు పెట్టాడు. భాగవతంలో ఉన్న ఉన్నత ఉపదేశాలను తన జీవితంలో ఆచరించే ప్రయత్నం చేశాడు.

ఆ తర్వాత చాలా రోజులు గడిచాయి. ఆ పండితుడు మళ్ళీ తన దగ్గరకు రాకపోవడంతో రాజు స్వయంగా ఒకరోజు పండితుని ఇంటికి వెళ్ళాడు. దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్న పండితుని ముఖమండలం దర్శించడంతోనే రాజు, 'నేను ఈ క్షణమే మీ శిష్యుణ్ణి కావడానికి సిద్ధంగా ఉన్నాను. దయచేసి నన్ను అనుగ్రహించండి' అని కోరాడు.

మనం తరగతి పుస్తకాలనూ, ఆధ్యాత్మిక పుస్తకాలనూ కేవలం డబ్బులు సంపాదించడానికి, పాండిత్యం సంపాదించడానికి మాత్రమే చదవకుండా వాటిలో ఉన్న ఉన్నత ఆదర్శాలను ఆచరించాలి. అప్పుడే మనం కూడా మహా పురుషులం కాగలం! ❖

గతమెంతో ఘనకీర్తి

– బి. సైదులు

రామరావణ యుద్ధం ముగిసింది... స్వర్ణమయమైన లంకానగరం నిశ్శంకగా శ్రీరాముని హస్తగతమైంది... ఆ రావణబ్రహ్మ స్వర్గసుఖాల ఆ మహాసౌధాలనూ, సుందరవనాలనూ చూసి లక్ష్మణుడు ముచ్చటపడతాడు... ఇక్కడే ఉండిపోదామంటాడు అన్న రామచంద్రుడితో! అప్పుడు ఆ దశరథాత్మజుడు సున్నితంగా తిరస్కరిస్తూ ఇలా అంటాడు

అపి స్వర్ణమయీ లంకా స మే లక్ష్మణ! రోచతే!
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి!!...

'లక్ష్మణా! స్వర్ణతుల్యమై తళతళా మెరిసిపోతున్నా ఈ లంకా పట్టణం నన్ను ఆకర్షించడం లేదు! అయినా కన్నతల్లి, కన్ననేల స్వర్గం కంటే ఎంతో గొప్పవి' అంటూ అయోధ్యా నగరానికి పయనమవుతాడు! సాక్షాత్తూ ఆ భగవంతుడే మెచ్చి, ముచ్చటపడి అవతారం దాల్చిన ధన్యభూమి భారతావని. భౌతికసుఖాలతో, భోగ భాగ్యాలతో విలసిల్లుతూ ఆధునికతలో ఎంతో ముందున్నాయనుకుంటున్న దేశాల ఉనికి కూడా లేని వేల ఏళ్ళ క్రితమే నవీన నాగరకత ఛాయలు ఉట్టిపడిన యోగ భూమి మనది. గణితం నుంచి గగన ప్రయోగాల వరకు సమస్త రంగాలకు మన పరమపావన భారతావనే తొలిపాఠశాల. కాని దురదృష్టవశాత్తూ ఈతరం జాతివారసత్వ వైభవాన్ని విస్మరిస్తోంది; అమ్మ పెట్టిన ఆవకాయను మరచి పొరుగింటి పుల్లకూర కోసం అర్రులు చాస్తోంది.



భరతభూమీ నమస్తుభ్యం...

It is not only a country something geographical, but the home and the youth of the soul,the every-where and nowhere, the oneness of all times... అంటారు జర్మన్ కవి, రచయిత హెర్మన్ హెస్సే. భారతదేశం ప్రపంచపటంలోని ఒక భౌగోళికపరమైన ఉనికి మాత్రమే కాదు. యావత్ ప్రపంచానికీ, మానవాళికీ దిశానిర్దేశం చేసిన చారిత్రక వారసత్వం పుణికిపుచ్చుకున్న నేల ఇది. ఎన్నో కారణాలతో వందల సంవత్సరాలు పరాయి పాలనలో మగ్గినా; దురాగతాలతో, దాష్టీకాలతో గాయపడినా; కించిత్తు కూడా తన ప్రాభవాన్ని కోల్పోలేదు. భౌతికంగా కొన్ని గురుతుల్ని చెరిపేసినంత మాత్రాన, కట్టడాలను కూల్చేసినంత మాత్రాన చెరిగిపోయి, సమసిపోయే వారసత్వం కాదు మనది. అందుకే విదేశీయుల నుంచీ 'భరతభూమీ నమస్తుభ్యం' అని నీరాజనాలందుకుంటుంది. కాని నేటితరం మాత్రం మన మూలాలు మరచి, పైపై మెరుగుల వెంట పరుగుల తీస్తుంది.

త్యాగభూమి... యోగభూమి

భారతదేశపు గాలి, నీరు కూడా ఎంతో ఘనమైనవి! మనం కృత్రిమ వస్తువులకు దాసులమవ్వాల్సిన అవసరం ఎంత మాత్రం లేదు; ఇంతకు ముందు కూడా మనం వీటికి దాసులం కాలేదు; అవసరాన్ని బట్టి వీటిని ఉపయోగించేవాళ్ళం; వస్త్రాలు తది తరాలు సాధనాలు కాని లక్ష్యాలు కావు అంటారు రవీంద్రనాథ్ టాగూరు. అమెరికా తదితర దేశాల్లా మనది భోగభూమి కాదు; మన శరీరాలు కాని, మనస్సు కాని నిజానికి భౌతికభోగాలకు అనువైనవి కావు; పాశ్చాత్యులను అనుకరిస్తూ బలవంతంగా ఆయా సుఖాలను అనుభవించాలని అనుకున్నా అంతా కృత్రిమంగానే కనిపిస్తుంది. కారణం మన మౌలిక జీవనవిధానం. మన తరతరాల వారసత్వం త్యాగపూరితమైంది. చరిత్రలో మనం ఆదర్శంగా తీసుకుంటున్న మహనీయులంతా త్యాగమూర్తులే! కాని బాధాకరమైన విషయమేమంటే పరాయిదేశస్థులంతా ధ్యానం, యోగం అంటూ మనవైపు దృష్టిసారిస్తుంటే మనమేమో భోగం, భాగ్యం అంటూ ఆయా దేశాల వైపు దిక్కులు చూస్తున్నాం.

కర్మభూమి....ధర్మభూమి

Many civilizations just vanished because they could not perform their duties. But Indian civilization has continued to exist and is said to be five thousand years old అంటారు బహుభాషా కోవిదులు, పండితులు పీ.వీ. నరసింహారావు. మానవజీవన వ్యవస్థకు ప్రణాళికాబద్ధమైన విధివిధానాలను కూడా నిర్దేశించిన కర్మభూమి మనది. వ్యక్తి కర్మానుసారంగా వర్ణవ్యవస్థను రూపకల్పన చేసిన దేశం మనదే! ఎవరి ధర్మాలు వారు సక్రమంగా నిర్వర్తిస్తే సమాజం సజావుగా సాగిపోతుంది. అందుకే కాస్త లోటుపాట్లు ఉన్నప్పటికీ స్వధర్మాన్నే ఆచరించు; పరధర్మం భయంకరమైనదని భగవద్గీతలో అప్పుడే హెచ్చరించాడు శ్రీకృష్ణపరమాత్ముడు. కాని అంతటి హితవును కూడా నేడు మనం విస్మరించాం. ఫలితంగా వ్యవస్థలో సమతౌల్యం లోపిస్తోంది. తమ తమ స్వభావాలకు, స్వధర్మాలకు సరిపోలని వృత్తివ్యవహారాలలో తల మునకలై చాలా మంది చేతులు కాల్చుకుంటున్నారు.

దివ్యభూమి... ధన్యభూమి

The Indian way of life provides the vision of the natural, real way of life. We veil ourselves with unnatural masks. On the face of India are the tender expressions which carry the mark of the creator's hand అంటారు జార్జ్ బెర్నార్డ్ షా. సహజ, సరళ జీవనం మన వారసత్వం. ముఖ్యంగా ఎంతటి ఉద్రిక్త పరిస్థితులకు కూడా చలించని ధీరోదాత్తత మనది. ప్రపంచంలో ఏ దేశంపై కూడా ఇన్ని దాడులు జరగలేదు; ఏ దేశానికి కూడా ఇంత నష్టం వాటిల్లలేదు. అయినా అంతటి క్లిష్టపరిస్థితుల్లో కూడా మన పౌరులు కుంగిపోలేదు; విలువల్ని విడచి నడుచుకోలేదు. ప్రకృతిపరంగా తీసుకున్నా, పరాయిపాలనా పరంగా తీసుకున్నా ఎన్నో అననుకూల విఘాతాలు ఎదురయ్యాయి. అయినా ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా, స్థైర్యంగా నిలుచున్నారు. కాని అంతటి వారసత్వానికి వారసులైన మనం మాత్రం కాస్తంత ఓటమికే కుమిలిపోతున్నాం; కూలిపోతున్నాం.

సహనం... సౌభ్రాతృత్వం....

తాత్త్విక చింతన లేని నాగరకత గర్భగుడి లేని దేవాలయం లాంటిదని నిరూపించిన నేల మనది. అయిదు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన మన నాగరకత సహనానికీ, సౌభ్రాతృత్వానికీ ఎంతో ప్రాధాన్యాన్నిచ్చింది. ప్రపంచ చరిత్రలోనే మహత్తరమైన, ఆదర్శనీయమైన స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపిన ఘనత మనది. సామాజిక విప్లవాలకు సరికొత్త నిర్వచనాన్నిచ్చి ఉద్యమాల రూపురేఖల్నే మార్చిన పవిత్ర చరిత్ర మనది. ఇలా మన వారసత్వం వికాసానికే తప్ప హింసాత్మక విప్లవాలకు తావివ్వలేదు. సృజనాత్మకంగా, నిర్మాణాత్మకంగా, శాంతియుతంగా ఉద్యమాలు నడిపిన నాయకత్వం మన దేశానికి సుసంపన్న మార్గదర్శకత్వంగా నిలిచింది. మౌలికమైన ధర్మాల్నీ, విలువల్నీ విడువకుండా సరికొత్త సవాళ్ళను, ఒత్తిళ్ళను, సర్దుబాట్లను స్వాగతిస్తూనే ఉంది. కానీ దురదృష్టవశాత్తూ నాయకత్వ లోపంతో నేడు ఎన్నో ఉద్యమాలు ఉనికి లేకుండా పోతున్నాయి. పోరాటానికి అనుచరులను ముందుకు తోసి, ఫలితాలను మాత్రం తాము అనుభవించాలను కుంటున్న ఎందరో నాయకులు ఉద్యమస్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నారు.

ఆ అడుగులనే అనుసరిద్దాం....

యౌవనాల్నీ, భోగ భాగ్యాల్నీ, సంతోషాల్నీ, తమ సర్వస్వాన్నీ భావిభారతం కోసం త్యాగం చేసిన వారిని స్మరించుకోవడం మనందరి విధి. వారిలో సర్వరంగ పరిజ్ఞానులూ ఉన్నారు; సర్వసంగపరిత్యాగులూ ఉన్నారు. వారి అడుగుజాడల వెంట పయనిస్తూ, మనదంటూ, మనకంటూ చెప్పుకునే ఘన వారసత్వాన్ని ముందు తరాలకు అందించడం మన గురుతర బాధ్యత. దానికి అందరం కంకణబద్ధులం కావడం మన తక్షణ కర్తవ్యం. ❖

నా భారతం... అమరభారతం

భారతీయ సమాజం నా బాల్యడోలిక, యౌవన ఉద్యానవనం, వార్ధక్యపు వారణాసి. పరాయిదేశాలు సందర్శించకముందు నేను నా దేశాన్ని కేవలం ప్రేమించేవాణ్ణి; కానీ ఆ దేశాలన్నీ సందర్శించాక భారతదేశం దుమ్ము, ధూళి, గాలి కూడా నాకు పరమపవిత్రంగా తోస్తున్నాయి.

ఈ దేశం ఒక పవిత్రభూమి. ప్రపంచానికి వైజ్ఞానిక, ఆధ్యాత్మిక భిక్షను పెట్టింది. వేదాంత పరిజ్ఞానంలో ప్రపంచ దేశాలతో పోలిస్తే గణనీయమైన పరిణతిని సాధించింది మన దేశమే. ఈ సత్యాన్ని ప్రసిద్ధ వేదాంత శాస్త్రవేత్త, జర్మనీ దేశస్థుడైన షోపెన్‌హావర్ అంగీకరించాడు. సంగీతంలో సప్తస్వరాల ఆరోహణ, అవరోహణ క్రమాన్ని రచించి ప్రపంచానికి అందించినది మనమే!

చరిత్ర పుటలు తిరగేయండి; మన దేశంలో ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన ఆధ్యాత్మిక జ్ఞానప్రవీణులకు ఏ కాలంలోనూ కొరత లేదు. ఈ సత్యాన్ని ఎవరూ కాదనలేరు. మనది ఆధ్యాత్మిక ధరణి; దీనిని యుద్ధాలతోను, సైనికదాడులతోను కొల్లగొట్టలేరు.

యువతా! మనోనైర్మల్యాన్ని సాధించు!

– స్వామి రఘునాయకానంద

ఒక యువసన్న్యాసి రాచఠీవితో చికాగో నగర వీథులలో నడుస్తూ వెళుతున్నాడు. ఆయన వెనుక కొంత మంది అమెరికన్ యువకులు కాషాయ వస్త్రధారణలో ఉన్న ఆ సన్న్యాసిని చూసి వారిలో వారు అవహేళనగా మాట్లాడు కొంటున్నారు. అది అంతా విన్న ఆ సన్న్యాసి యువకులకు గుణపాఠం చెప్పాలన్న ఉద్దేశంతో ఇలా అన్నారు:

In your country the tailor makes a man a gentleman, but the country from where I come, it's character which makes him a gentleman.

"మీ దేశంలో ఒక దర్జీ మనిషిని మర్యాదస్తునిగా తయారు చేస్తే మా దేశంలో మనిషి యొక్క వ్యక్తిత్వమే అతణ్ణి గౌరవనీయునిగా తీర్చిదిద్దుతుంది." – ఆ యువసన్న్యాసే స్వామి వివేకానంద.

దర్జీ తయారుచేసే గొప్ప వ్యక్తులు బాహ్యసౌందర్యానికే ప్రాముఖ్యతనిచ్చే వేషధారులు.. అలా కాకుండా శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దృఢంగాను, ఆరోగ్యంగాను ఉంచాలి. అదే బాహ్యశౌచం. గొప్ప మనిషిని తయారుచేసేది మనిషికున్న వ్యక్తిత్వమే – ఆయన మంచి లక్షణాలతో, మనోనైర్మల్యం కలిగిన వ్యక్తి. అదే అంతశ్శౌచం. మహర్షి పతంజలి ఈ శౌచాన్ని 'నియమం' క్రింద నిర్దేశించారు.

పరిశుభ్రత కానీ ..పాశ్చాత్య అనుకరణ కాదు

పాశ్చాత్య నాగరకతా ప్రభావంతో వేషధారణలో సహితం ఆ నాగరకతనే అనుసరిస్తున్న యువత స్వదేశ సంస్కృతినే మర్చిపోయే స్థితికి దిగజారుతుంది. Cleanliness is next to Godliness అన్నది సూక్తి. దేహసౌందర్యానికే ప్రాముఖ్యత ఇస్తున్న ఈనాటి యువత బాహ్యపరిశుభ్రతకు ప్రాముఖ్యాన్ని ఇవ్వడం లేదు. శరీరాన్ని శుచిగా ఉంచుకోవడంతో పాటు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. శరీరమాద్యం ఖలుధర్మ సాధనమ్ – ఏ కార్యమైనా సాధించడానికి శరీరం అవసరం కాబట్టి దాన్ని దృఢంగా ఉంచుకోవాలి. దానికై బాహ్య పరిశుభ్రత అవసరం. ఇనుపకండలు ఉక్కునరాలుగల మనుష్యులు దేశానికి అవసరం అంటారు స్వామి వివేకానంద. ఆ విధంగా శరీరాన్ని దృఢంగా ఉంచడంతో పాటు పరిశుభ్రంగానూ ఉంచుకోవాలి. దానినే బాహ్యశౌచం అంటారు.

ఆత్మోన్నతికై అంతశ్శౌచం

అంతశ్శౌచం మనస్సుకి సంబంధించింది. మనస్సును ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచాలి. ఉపనిషత్తులో ఋషి ఈ విధంగా ప్రార్థన చేస్తున్నాడు: "ఓ భగవంతుడా! నా శరీరాన్ని పరిశుభ్రం గావించు, నా మనస్సును నిర్మలం గావించు, నేను ఆత్మస్వరూపుణ్ణి అన్న భావనను నాలో నింపు." మనిషి మనోఫలకం మీద రకరకాల ముద్రలు పడి ఉంటాయి. అవి కామం, క్రోధం, గర్వం... వీటినన్నింటినీ తొలగించి ఆధ్యాత్మిక అలవాట్లను అలవరచు కోవాలి. భగవంతుణ్ణి ధ్యానించాలి. మనస్సును నియంత్రించే శక్తిని ఇమ్మని ఆయన్ను ప్రార్థించాలి. మనోఫలకం మీద ఉన్న మాలిన్యాన్ని తొలగించినప్పుడే మనస్సు స్వచ్ఛంగా ప్రకాశిస్తుంది. అప్పుడే ఆత్మస్వరూపులం అన్న భావన గోచరం అవుతుంది.

అంతశ్శౌచం లేని బాహ్యశౌచమేల?

శ్రీరామకృష్ణ పరమహంస శరీరం బంగారు ఛాయలో ఉండేది. ఒకసారి ఆయన కామార్పుకూరు నుండి జయరాంబాటి, సిహోర్ గ్రామాలకు వెళ్ళడానికి ఏర్పాట్లు చేయబడ్డాయి. ఆయన్ని చూడడానికి విపరీతమైన జనం వచ్చారు. ఆయన మేనల్లుడైన హృదయ్‌రామ్‌తో శ్రీరామకృష్ణులు ఇలా అంటారు:

"ఈ ప్రజలంతా బాహ్యసౌందర్యానికి ప్రాముఖ్యాన్నిస్తూ, భౌతిక శరీరంతో కూడిన ఆలోచనలతో నిండి ఉన్నారు. వారికి తమలో ఉన్న భగవంతుణ్ణి దర్శించాలన్న ఆవేదన మాత్రం ఉండదు." ఒక రైతు చేనికి కంచె ముఖ్యమని ఎవరో చెప్పడం విన్నాడు. ఆనాటి నుండి పొలానికి కంచె వేయడంతోనే కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. ఇంకొక రైతు 'ఏమయ్యా! పైరు పెట్టలేదేం' అంటే 'కంచె ముఖ్యమన్నారు కదండీ' అన్నాడు ఆ రైతు. చూశారా పైరు లేకుండా కంచె వేస్తే ఉపయోగమేమిటి? అదే విధంగా అంతశ్శౌచం లేని బాహ్యశౌచానికీ అంతే విలువ. అంతశ్శౌచం ద్వారా – మంచి ఆలోచనలతో, ధ్యానం, ప్రార్థనల ద్వారా మనోనైర్మల్యాన్ని సాధిద్దాం!

(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచి

ప్రియమైన వివేక్!* 24-7-1951

నీకు మనశ్శాంతి లేకపోవడానికి కారణం ఎంత శోధించినా నాకు అంతుబట్టడం లేదు. నీవు నీ ధనాన్ని ఇతరులకు ధారపోస్తే దానితో నీ ప్రక్కవారికి ఏమైనా సంబంధం ఉంటుందా? నీ సంపదకు నీవు అధిపతివి కాదా? నీవు స్వేచ్ఛా జీవివని నేను భావిస్తున్నాను. నీ అభిరుచికీ, స్వభావానికీ, పరిస్థితులకూ తగినట్లు నీవు నడుచుకుంటావు. అది ఇతరులకు సంతోషకరం కాకపోతే పోనీ! సమాజంలో ప్రతి ఒక్కరినీ తృప్తిపరచడం ఎవరికీ సాధ్యం కాదు. ప్రతివాడూ స్వేచ్ఛాజీవి. ప్రతివాడూ తన ఇష్టానికి అనుగుణంగా తన మార్గంలో తాను నడుస్తాడు. ఇతరుల భావాలకు అనుగుణంగా నడుచుకునేవారెవరైనా ఈ ప్రపంచంలో ఉన్నారా చెప్పు? ఈ చిన్ని అంశం గురించి నీవు క్రుంగిపోవడం ఎందుకు?

చూడు వివేక్! ఇక్కడ ఒకతను తన తప్పిదాలనూ, అపజయాలనూ తలచుకుంటూ విషాదంతో క్రుంగిపోయేవాడు. నేను "నీ అవగాహన మేరకు నీవు నడుచుకో. నీకు సాధ్యమైనదే చేసి సంతృప్తి పడు" అని పదే పదే చెప్పసాగాను. నేను నిరంతరం అలా చెప్పడం వల్ల అతనిలోని నిస్పృహ మాయమైంది. నీవు నీ సమస్య నెందుకు విషాదానికి గురి చేసుకుంటావు. "నేను మంచిగా ఉండి ఉంటే ఇంకా బాగా ఉండేవాడినేమో" అని నీవు అనుకోవచ్చు. కానీ నీ అంత మంచివాడిని నేనెక్కడా చూడలేదు. నేను ఎంత వెదికినా నీలో ఏ తప్పు నాకు కనిపించడం లేదు. మనిషి ఏమన్నా దేవుడా? వంద తప్పులు చేసినా, వంద బలహీనతలు ఉన్నా మనం మనిషిని మనిషిగానే ప్రేమిస్తాం.

నీకు నీవే నిరంతరం నిరాశతో క్రుంగిపోవడం ఒక చెడ్డ అలవాటుగా మారింది. నీ మనస్సు నుండి దుఃఖాన్నీ, విషాదాన్నీ తరిమి వెయ్యి. సంతృప్తుడవై ఉండు. అన్నివేళలా నవ్వుతూ ఉండడం అలవాటు చేసుకో. అమెరికాలో ఒక ఆధ్యాత్మిక సంస్థ ఉంది. "సంతోషంగా ఉండే అలవాటు"ను వారు సాధన చేస్తారు. ప్రతి పరిస్థితినీ వారు ఆనందంగా స్వీకరిస్తారు. ఆధ్యాత్మిక సాధనకు ఈ విధమైన ఓరిమియే మూలం. దుఃఖాన్నంతటినీ నవ్వుతూ భరించాలి. 'వివేక చూడామణి' లోని 24వ శ్లోకం ఇలా చెబుతుంది:

సహనం సర్వదుఃఖానాం అప్రతీకారపూర్వకం ।
చింతా విలాపరహితం సా తితిక్షా నిగద్యతే ॥

"దుఃఖాలన్నింటినీ ఓర్పుతో భరిస్తూ ఏ విధమైన విచారం వ్యక్తం చేయకుండా, ప్రతీకారం తీర్చుకోకుండా ఉండాలి" అని చెబుతోంది. అలా ఉండడానికి ప్రయత్నించు. నీ ముఖంపై ఎల్లవేళలా చిరునవ్వు చూసే భాగ్యం నాకు కలిగించు. విచారవదనంతో ఉండకు.

పూర్వకాలంలో "బ్రాహ్మణ సేవ, మహాత్ముల సేవ" అనేవారు. నేటి కాలంలో దానినే "జీవసేవ"గా భావించాలి. "సాధుషు అపి చ పాపేషు సమబుద్ధిః విశిష్యతే" – సజ్జనులనూ, దుర్జనులనూ కూడా సమదృష్టితో చూసేవాడు ప్రతిభావంతుడు అవుతాడు. యోగి మొదలు పాపి వరకు అందరినీ సమదృష్టితో చూడడమే నిజమైన దృష్టి" అని గీత బోధిస్తుంది.

(*వివేకానంద చౌధురి కాలాంతరంలో స్వామి ప్రభానందగా ప్రసిద్ధులు. రామకృష్ణ మఠం, మిషన్‌ల ప్రస్తుత ప్రధాన కార్యదర్శి.)

ప్రేమాశీస్సులతో...
స్వామి ప్రేమేశానంద

తెలుగుసేత : కె. త్రివిక్రమరావు

రామకృష్ణ మఠం & మిషన్

రిమ్స్ ఆసుపత్రి దగ్గర, కడప - 516 002. ఫోన్: 08562-200120, 200633
నగర కేంద్రం: రామకృష్ణ మఠం, ట్రంకు రోడ్డు, కడప - 516 001. ఫోన్: 08562-241633
Email : kadapamath@yahoo.com, website : www.rkm-kadapa.org

విన్నపం

మూర్తిత్రయం యొక్క అపారమైన కృప, భక్తులు, హితైషుల సహాయ సహకారాలతో కడపలోని రామకృష్ణ మిషన్ నాలుగేళ్ళలోనే చెప్పుకోదగ్గ అభివృద్ధిని సాధించింది. ప్రస్తుతం కడప శివార్లలో పాలకొండల వద్దనున్న రిమ్స్ ఆసుపత్రి దగ్గర ఉన్న 10 ఎకరాల అత్యంత ఆకర్షణీయమైన ఆవరణలో సేవా కార్యకలాపాలను నిర్వహిస్తోంది.

ముఖ్యమైన కార్యకలాపాలు:

1. ముప్పై మంది బాలురున్న ఉచిత వసతిగృహం.
2. కార్యాలయం, గ్రంథాలయం, పుస్తక విక్రయశాల.
3. వివేకానంద విద్యానికేతన్ ప్రాథమిక పాఠశాల.
4. విలువలతో కూడిన విద్యా కార్యక్రమం–విద్యా (VIDYA).
5. వ్యావసాయిక శిక్షణా కార్యక్రమాలు.
6. స్పోకెన్ ఇంగ్లీష్ కోర్స్. 7. నారాయణ సేవ.

వీటితో పాటు నిత్యం పూజ, భజనలు, ప్రవచనాలు, ఆధ్యాత్మిక అంతర్యోగం, ఉచిత పఠనాలయం, ఉచిత హోమియో చికిత్స (వారానికి ఒకమారు) లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ మధ్య కర్నూలు జిల్లాలో వరద బాధితులకు సేవా సహాయక చర్యలను మిషన్ చేపట్టింది.

భక్తులు ఎంతగానో ఎదురుచూస్తున్న భగవాన్ శ్రీరామకృష్ణుల విశ్వజనీన దేవాలయానికి 2009 సెప్టెంబర్ 6న రామకృష్ణ మఠం, మిషన్ల ఉపాధ్యక్షులు శ్రీమత్ స్వామి స్మరణానందజీ మహారాజ్ శంకుస్థాపన చేశారు. వీలైనంత త్వరలో సుందరమైన, విశాలమైన ఆలయ నిర్మాణం కావించడానికి మీ అందరి సహాయ సహకారాల్ని కోరుతున్నాం. పాఠశాల భవనానికి ఉపకరణాలు, వాహనాలు (స్కూలు బస్సు మొదలైనవి) సమకూర్చడానికీ, వివిధ విద్యా కార్యక్రమాల నిర్వహణకు శాశ్వత నిధిని ఏర్పాటు చేయడానికీ సంకల్పించాం. ఈ క్రింద సూచించిన పథకాల నిర్వహణ కోసం భక్తులు,శ్రేయోభిలాషుల నుండి విరాళాల్ని కోరుతున్నాం.

నూతన భగవాన్ శ్రీరామకృష్ణ దేవాలయ నమూనా

- ★ శ్రీరామకృష్ణుల విశ్వజనీన దేవాలయం– రూ. 140 లక్షలు
- ★ స్కూలు ఫర్నీచర్,ఎక్విప్‌మెంట్, 2 బస్సులు–రూ. 25 లక్షలు
- ★ విద్యాసంస్థల నిర్వహణకై శాశ్వతనిధి– రూ. 100 లక్షలు

విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80 (జి) కింద పన్ను మినహాయింపు లభిస్తుంది. Ramakrishna Mission, Kadapa పేరిట చెక్కు కానీ, డి.డి. కానీ తీసి Ramakrishna Mission, Near RIMS Hospital, Kadapa-516 002 చిరునామాకు పంపగలరు.

భగవత్సేవలో
స్వామి ఆత్మవిదానంద
కార్యదర్శి

Advt.,

సాహస బాలుడు

– జిల్లా ప్రభు

ఒకసారి బీజాపూర్ సుల్తాన్ సేనాధిపతి తన పన్నెండేళ్ళ కుమారుణ్ణి సుల్తాన్ కొలువుకు తీసుకువెళ్ళాడు. ఆనాటి ఆచారం ప్రకారం సేనాధిపతి మూడుసార్లు చేతిని నేలకు తాకించుతూ వంగి సుల్తాన్‌కు సలాము చేశాడు. తన కుమారుణ్ణి కూడా అదే విధంగా "సలాం" చేయమని చెప్పాడు. ఆ మాట వినడంతోనే ఆ పిల్లవాడు నాలుగు అడుగులు వెనుకకు వేసి "నేను పరాయి పాలకుల ఎదుట ఎప్పుడూ తలవంచను" అనే భావనతో సింహము వంటి ఠీవితో, దర్పంగా కొలువు నుండి బయటకు వచ్చేశాడు. బీజాపూరు సుల్తాన్ ఎదుట ఇంత సాహసంగా ప్రవర్తించిన వారు అంతవరకూ ఎవరూ లేరు. ఆ చిన్న సాహసబాలుడే తదనంతర కాలంలో క్రూరమైన మొగలాయి పరిపాలనలో హిందూ సమాజం మ్రగ్గుతున్న తరుణాన గోబ్రాహ్మణ ఆలయాలకు రక్షణ లేని సమయాన స్వతంత్ర హైందవ సామ్రాజ్యాన్ని స్థాపించి, హిందూ దేశంలో హిందువులు సగర్వంగా జీవించగలిగే స్థితిని నిర్మాణం చేసిన మహనీయుడు ఛత్రపతి శివాజీ. ఆ సేనాధి పతియే 'షా'జీ.

చిన్న వయసులోనే శివాజీలో అంత ధైర్యం, శౌర్యం, దేశభక్తి, ధర్మం, ప్రేమ, స్వాభిమానం వంటి గొప్ప గుణాలు ఏర్పడడానికి కారణం రామాయణం, మహాభారతం, పురాణ గ్రంథాలలోని వీరులు, మహనీయుల యొక్క జీవితాలు కథలుగా చెప్పిన పవిత్ర మాతృమూర్తి జిజీయా భాయి పాత్ర చిరస్మరణీయం. ❖

మృదుభాషిణి

– జి. సతీష్

మదర్ థెరెస్సా చదువుకునే రోజులవి... వాళ్ళ కాన్వెంటులో ఒక ఉపాధ్యాయిని ఎప్పుడూ చిర్రుబుర్రులాడుతూ, కదిలిస్తే కసురుకుంటూ ఉండేవారు. అందువల్ల తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవిడతో మాట్లాడాలంటే భయపడేవారు; తప్పించుకు తిరిగేవారు. మదర్ థెరస్సా కూడా కాన్వెంటులో చేరిన తొలిరోజుల్లో ఆ ఉపాధ్యాయిని అంటే భయపడేవారు. కానీ రానురాను థెరెస్సా వైఖరిలో మార్పువచ్చింది. ఎవరూ చేయని సాహసం చేశారామె! ఆ ఉపాధ్యాయినిని తనే ముందు పలకరించడం ప్రారంభించారు; జోక్యం చేసుకొని మరీ ఆమెతో సంభాషించ డానికి ప్రయత్నించేవారు. కాన్వెంటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. థెరెస్సా పులినోట్లో తలపెడుతోందని వ్యాఖ్యానించుకునేవారు. ఆ ఉపాధ్యాయిని కనిపించినప్పుడల్లా మదర్ థెరెస్సా చిరునవ్వు నవ్వేవారు; పనుల్లో ఆవిడకు సహాయం చేసేవారు. ఈ ప్రవర్తన విద్యార్థులతో పాటు చిర్రుబుర్రులాడే సదరు ఉపాధ్యాయినికి కూడా ఆశ్చర్యం కలిగించింది. ఇదే విషయాన్ని థెరెస్సా ముందు ప్రస్తావిస్తూ 'తల్లీ! నాతో మాట్లాడాలంటే అందరూ భయ పడతారు కదా! మరి మనం కలుసుకున్నప్పుడల్లా నువ్వు ఎందుకు అంత మృదువుగా, తీయగా నవ్వుతావు; ఆప్యాయంగా మాట్లాడతావు. నాలో నీకంత ఆకర్షణేం కనిపించింది?' అంటూ సందేహాన్ని వ్యక్తం చేసింది ఆ ఉపాధ్యాయిని. అప్పుడు మదర్ థెరెస్సా "టీచర్! మీలో నేను జీసెస్‌ను చూస్తున్నాను; మీతో మాట్లాడుతున్నంత సేపూ నేను ఆయనతో సంభాషిస్తున్నట్లే భావిస్తున్నాను; ఆయన ఎంత చేదునైనా అత్యంత మాధుర్యంగా మార్చగలడని నమ్ముతాను" అని అన్నారు. ఆనాటి నుంచి ఆ ఉపాధ్యాయిని వైఖరే మారిపోయింది. అంతటి కరుణార్ద్ర హృదయిని కనుకనే మదర్ థెరెస్సాగా లోకానికి సేవచేయ గలిగారు. తన భాషణతో, మృదుస్వభావంతో ఎంతటి పాషాణ హృదయులనైనా మార్చవచ్చని మదర్ నిరూపించారు... ❖

శ్రీరమణ తత్త్వము

రచన : శ్రీమతి బొప్పన అరుణాదేవి
వెల : రూ. 75/-, పేజీలు : 237
ప్రతులకు: బొప్పన ప్రియాంక
201, విష్ణు ఎవెన్యూ, ఇ-2,
మధురానగర్, హైదరాబాద్ - 500 038

ఆధునిక ఆధ్యాత్మిక యుగంలో శ్రీరమణ మహర్షి పరిపూర్ణజ్ఞానయోగి. ఆయనను అర్థం చేసుకోవటమంటే ఆత్మసాక్షాత్కారానికి ప్రధానమైన జ్ఞానయోగానికి చేరువైనట్లే. "నేను" ఏమిటో తెలుసుకుంటే సమస్తం తెలుసుకున్నట్లే, అనేవారు తనదగ్గరకు వచ్చిన భక్తులతో. శ్రీరమణులు తన కర్మల ద్వారా మౌనం ద్వారా అనుష్ఠానవేదాంతాన్ని తెలియచెప్పారు.

అటువంటి అద్భుతమైన రమణతత్త్వమును సులభ మార్గంలో ప్రజలకు అందించటానికి పూనుకున్నారు శ్రీమతి అరుణాదేవి గారు. శ్రీ రమణుల సంక్షిప్తజీవిత చరిత్రతో ప్రారంభించి, తాను చెప్పదలచుకొన్న విషయాన్ని 11 భాగాలుగా విభజించి రచించారు. ఉన్నది నలుబది అనే ప్రకరణంలో శ్రీరమణులు అహం తత్త్వాన్ని, ఆత్మవిచారాన్ని వివరించిన విధం, అతి సులభమైన, సరళమైన భాషలో చక్కగా వ్రాయటం, రచయిత్రి రచనా నైపుణ్యానికి నిదర్శనం. ఆధ్యాత్మిక చింతనాసక్తులందరూ చదువవలసిన పుస్తకమిది. ❖ - ఎం.వి. నాగప్రసాద్

నీతి చంద్రిక



పరిష్కర్త- వ్యాఖ్యాత : డాక్టర్ కండ్లకుంట్ల అళహ సింగరాచార్యులు,
వెల: రూ. 90/- , పేజీలు : 302
ప్రతులకు : నవ్య పబ్లిషింగ్ హౌస్,
3-5-927, హిమాయత్‌నగర్,
హైదరాబాద్- 500 029

సమాజానికి కొన్ని కట్టుబాట్లు, నీతినియమాలు అత్యవసరం. అప్పుడే ఆ సమాజం విలువలతోకూడి మనగలుగుతుంది. అందుకోసమే విష్ణుశర్మ అనే సంస్కృత పండితుడు "పంచ తంత్రము" అనే ఒక గొప్ప నీతి శాస్త్ర గ్రంథాన్ని మానవజాతికి అందించాడు. ఈ పుస్తకంలో, మహాపండితుడైన చిన్నయసూరి ఆంధ్రీకరించిన రెండు తంత్రాలైన మిత్రలాభము, మిత్ర భేదములు, ప్రముఖ రచయిత వీరేశలింగం పంతులు తెలుగులో అందించిన తంత్రాలైన సంధి, విగ్రహములను చక్కగా వ్యాఖ్యానించారు డా॥ కండ్లకుంట్ల అళహసింగరాచార్యులు. ఈ కథలలో ఎక్కువపాత్రలు పశువులు, పక్షులు, మృగాలుగా ఉంటాయి. విష్ణుశర్మ రాజకుమారులకు అడవులలో ఈ రాజనీతిబోధన చేయడంవలన తేలికగా అర్థమవడానికి ఆ పరిసరాలలోని పక్షులు జంతువులతోనే ఎక్కువగా కథలల్లారు. తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల చేత ఈ పుస్తకం చదివిస్తే వారికి జీవనవిలువలు, నీతి నియమాలతో పాటు భాషాపరిజ్ఞానం కూడా వృద్ధి చెందుతుంది. ❖ - పోపూరి విశ్వనాథ్

ఆత్మైక బోధ (ద్విపద)

రచన : యోగానందావధూత
పరిష్కర్త : కపిలవాయి లింగమూర్తి
వెల : రూ. 30/- , పేజీలు : 80
ప్రతులకు : కె. కిశోర్ బాబు, 'వాణీ సదనం',
17-110, విద్యానగర్ కాలనీ,
నాగర్ కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లా

సౌందర్యలహరి

(భావార్థ, వివరణ సహిత సౌందర్యలహరి)

రచన : జగద్గురు శంకరాచార్యులు
వ్యాఖ్యాత : శ్రీమతి కురుగంటి శ్యామలాదేవి,
వెల : రూ. 50/- , పేజీలు : 96
ప్రతులకు : శ్రీ లలితా ధ్యాన మండలి
2వ లైను, భాగ్యనగర్, ఒంగోలు-523 001



శ్రీరామకృష్ణ శారదా వివేకానందుల సంక్షిప్త జీవిత చరిత్రలు

వెల. రూ. 5/- , పేజీలు : 40

స్వామి వివేకానందుని మార్గములో సమస్యల పరిష్కారము

వెల. రూ. 3/- , పేజీలు : 20

ప్రతులకు : విశాఖపట్టణం వివేకానంద యువ మహామండలి,
C/O శ్రీ గణపతి సేవాసమితి, గూర్ఖాలైను, విశాఖపట్టణం-4

స్ఫూర్తినిచ్చిన మహా వాక్యం!

నా పేరు ఇ. గోపి. మాది చిత్తూరు జిల్లా. నేను శ్రీకాళహస్తికి సమీపంలో అంజూరు అనే కుగ్రామంలో జన్మించాను. నేను ప్రస్తుతం వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేస్తున్నాను.

నేను డిగ్రీ చదువుకొనేటప్పుడు, మా కళాశాల ప్రధాన ద్వారం గేటు మీద ఒక వాక్యం ఇంగ్లీషులో వ్రాయబడి ఉండేది. అది ఏమిటంటే "Arise, awake and stop not till the goal is reached" – "లేవండి, మేల్కొనండి, మీ గమ్యం చేరే వరకు విశ్రమించకండి". ఆ ఒక్క వాక్యం నాలో స్ఫూర్తిని కలిగించింది. భవిష్యత్తులో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా, కష్టాలు ఎదురైనా, నేను అనుకున్న గమ్యం వైపు నడవాలనుకున్నాను. మనస్సులో తలచింది సాధించాలనుకున్నాను.

ఆ కారణంగానే, పట్టుదలతో M.A. B.Ed చదివి, మంచి మార్కులతో ఉత్తీర్ణుడనయ్యాను. అదే పట్టుదలతో హైస్కూల్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించగలిగాను. ఇప్పుడు నేను ఈ స్థితిలో ఉండడానికి ఆ మహావాక్యమే స్ఫూర్తి.

స్వామి వివేకానంద జీవిత చరిత్ర, వివేకానంద లేఖావళి, రాజయోగం, భక్తియోగం మొదలైన గ్రంథాలను చదివాను. విద్యార్థులకు ఆ మహాత్ముని గురించి ఆయన బోధనల గురించి చెబుతున్నాను.

ప్రతీ బుధవారం సాయంకాలం కొంత మంది యువకులతో 'వివేకానంద సత్సంగం'ను నిర్వహిస్తున్నాను. ఇదే విధంగా మా సత్సంగం కొనసాగాలని నా జీవితాన్నీ, మనస్సునూ మార్చిన ఆ మహావాక్యాన్ని నా హృదయంలో పదిలపరచుకొని, ఆ మహా నాయకునికి, శివరూపధారునికి ప్రణామాలు అర్పిస్తున్నాను.

(ఇ. గోపి, వడమాలపేట, చిత్తూరు జిల్లా)

మనోధైర్యానికి మంచి ఔషధం!

నా పేరు ఎస్.ఎస్. ప్రశాంతి. నేను ప్రస్తుతం 12వ తరగతి చదువుతున్నాను. ఎనిమిదో తరగతి నుండి నాకు స్వామి వివేకానందుని పుస్తకాలు చదవడం అలవాటు. నాకు అమితంగా నచ్చిన పుస్తకాలు 'జాగృతి', 'అమృతస్య పుత్రాః'.

'జాగృతి' పుస్తకంలో పామరులకూ, పండితులకూ సైతం స్వామీజీ మాటలు, ఆయన భావాలు సూటిగా తాకేలా ఉన్నాయి. నా జీవితంలో విజయాలన్నీ స్వామీజీ ఇచ్చిన ధైర్యంతో లభించినవి.

ఇక ఓటముల విషయానికొస్తే అవి తట్టుకొనే మనోధైర్యాన్ని నాకు స్వామీజీ వాక్కులు ప్రసాదించాయి. నేను తొమ్మిదో తరగతిలో ఉండగా జనవరి 12వ తేదీ జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నన్ను స్వామీజీ గురించి ఉపన్య సించమన్నారు. నేను స్వామీజీని తలచుకొని, వేదిక పైకి ధైర్యంగా వెళ్ళాను. అసలు నాకు తెలియదు ఆ ధైర్యం ఎక్కడి నుంచి వచ్చిందో! ఆపకుండా పదిహేను నిమిషాలు మాట్లాడాను. మా ప్రిన్సిపాల్ గారు, మా తెలుగు మాస్టారు నన్ను పొగిడిన విధానం నా చెవిలో ఇప్పటికీ మారుమ్రోగుతోంది.

మూగవాణ్ణి మాట్లాడించగల
అవిటివాణ్ణి ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్ళగల
మొండి మనిషిని మనీషిగా తీర్చిదిద్దగల
శక్తి స్వామీజీ మాటలకు ఉంది.

స్వామీజీ కలలు కన్న భారతావని నిర్మాణంలో ఒక చిన్న ఇటుకను కావాలని నా కోరిక. అందుకు నేను నా జీవితాంతం కృషి చేస్తాను. అజ్ఞానాంధకారంలో కొట్టు మిట్టాడుతున్న వారికి జ్ఞానజ్యోతి, అవనిపై అద్భుతాలు సృష్టించగల యువతరానికి స్ఫూర్తి ప్రదాత, భారతావనిని ఆత్మవిశ్వాసంతో నింపిన యుగకర్త, మహాప్రవక్త స్వామి వివేకానంద. ఆధ్యాత్మికతే అవనిపై ఆయువు పెంచే వాయువని చాటిచెప్పిన మహర్షి స్వామీజీ.

స్వామీజీ మాటలు ఇప్పటికే చాలా మందిని ప్రభావితం చేశాయి. ఆయన కన్న కలలు నిజమయ్యే సమయం ఆసన్నమయింది. ఇంకెంతో దూరంలో లేదు ఆ రోజు!

(ఎస్.ఎస్. ప్రశాంతి, కర్నూలు)

... 17వ పేజీ తరువాయి


10
ఒకసారి మిత్రుడు మర్తనాతో పైన్ నదికి వెళ్ళి నీటిలో మునిగిన నానక్ బయటకు రాలేదు. మర్తనా తల్లడిల్లిపోయి నవాబ్‌తో విషయం చెప్పాడు. ఎంత వెతికినా నానక్ జాడ తెలియలేదు.
అదుగో చూడండి! మన నానక్! ఆహా! ఆయన ముఖంలో దైవత్వం ఉట్టిపడుతోంది.
11
మూడో రోజున... నానక్ కాస్తా గురునానక్‌గా పరిణమించాడు. ప్రగాఢ ధ్యానంలో లయించిన దృక్కులతో మానవ రూపంలో దైవంగా గురునానక్ బయటకు వచ్చాడు.
హిందువు కాదు, ముసల్మానూ కాదు. అందరూ శ్రమ కోర్చి సంపాదించి ఇతరులతో కలసిమెలసి ఆనందంగా ఉండాలి.
12
ధ్యానస్థితిలో నానక్ ముఖతః వెలువడిన మహోన్నతమైన పలుకుల్ని విని, ఆయన్ని చూడడానికి నవాబు వచ్చాడు.
అయ్యా! హిందువు కాదు, ముసల్మానూ కాదు అంటున్నారే. దాని అర్థం వివరించలేదే!
భగవంతుని కరుణే మసీదు. సత్ప్రవర్తన ఖురాన్. గౌరవమే నోము. వినమ్రతే దానం – అని తెలుసుకొని ప్రవర్తించేవారే నిజమైన ముసల్మాన్ అవుతారు.
13
గురునానక్ ఉపదేశాన్ని నవాబ్ గ్రహించి, స్వీకరించాడు. కానీ ఖాజీ మాత్రం నానక్‌ను నమ్మలేదు.
నువ్వు ముసల్మానువైతే భగవంతుని ఏకత్వంలో నమ్మకం ఉంచి, మాతో ప్రార్థనకు రా.
భగవంతుని పట్ల నమ్మకం ఉన్న వారితోనే నేను కలసి ప్రార్థన చేస్తాను. కానీ మిగతా వారితో ప్రార్థన చేయను.



శాంతమయుడైన గురునానక్ తన మతంతో విశ్వజనీనమైన ప్రేమను బోధించాడు. ఆయన విశాల హృదయం తెరుచుకుంది. హిందువులను

మాత్రమే కాక మహమ్మదీయులతో సహా యావత్ప్రపంచాన్నీ ఆలింగనం చేసుకోవడానికి ఆయన చేతులు చాచాడు. - స్వామి వివేకానంద

భక్త జయదేవుడు

– శ్రీమతి బొప్పన అరుణాదేవి

సంగీత నృత్యాలున్నచోట జయదేవుడి పాటలు తప్పకుండా ఉంటాయి. జయదేవుడి 'గీతగోవిందం' ఎంతో ప్రాచుర్యం పొందింది. వంగదేశంలో జన్మించిన జయదేవుడు, జగన్నాథస్వామి భక్తుడు. మధురభక్తి ద్వారా భగవంతుణ్ణి ఆరాధించాడు. సంస్కృతంలో రచించిన 'గీత గోవిందం'లో రాధాకృష్ణుల దివ్య ప్రేమను రసవత్తరంగా వర్ణించాడు.

అప్పట్లో ఒరిస్సాను సాత్యకి అనే రాజు పరిపాలించేవాడు. ఆయన కూడా కవి. జగన్నాథస్వామి వైభవాన్నీ, గుణ గణాలనూ స్తుతిస్తూ కొన్ని పాటలు వ్రాశాడు. కానీ ప్రజలు జయదేవుడి అష్టపదులనే మెచ్చుకునేవారు. అది రాజుకు బాధ కలిగించింది. జయదేవుడి అష్టపదులు, తన పాటలు ఉన్న గ్రంథాలను గుడి లోపల ఉంచి బయట తలుపులు వేశాడు. ఆశ్చర్యకరంగా తెల్లవారేసరికి జయదేవుని అష్టపదులు భగవంతుని సన్నిధిలో ఉండగా, రాజు రచించిన గ్రంథం గుడి వెలుపల ఉంది. భగవంతుడి నిర్ణయాన్ని అంగీకరించాడు రాజు.

వంగదేశాన్ని పరిపాలించిన లక్ష్మణ సేనుని ఆస్థానంలో ప్రముఖ కవి జయదేవుడు. అతనికి 'కవిరాజు' అనే బిరుదు ఉండేది. జయదేవుని అర్ధాంగి పద్మావతి. ఆమె అపురూప లావణ్యవతే కాకుండా, గొప్ప నాట్యకత్తె. పద్మావతీ జయదేవులది అన్యోన్య దాంపత్యం. జయదేవుడు 'గీత గోవిందం'లోని శ్లోకాలు పాడుతూ ఉంటే, పద్మావతి నాట్యం చేసేదట. జయదేవుడు, రాజుగారి అభిమానం పొందిన విధంగానే పద్మావతి కూడా రాణిగారి ఆదరణ, అభిమానం చూరగొంది. వారిరువురూ ఎంతో ఆత్మీయంగా ఉండేవారు.

ఒకనాడు పద్మావతి, రాణిగారి అంతఃపురంలో ఉండగా, ఒక సేవకుడు వచ్చి "మహారాణీ! మీ సోదరుడు చనిపోయాడు. అతని భార్య సహగమనం చేసింది" అనే వార్తను వినిపించాడు. రాణి చాలా దుఃఖపడింది. పద్మావతి మౌనం చూసి, రాణి ఆమెను కారణం అడిగింది. అప్పుడు పద్మావతి, "మహారాణీ! పతివ్రత అయిన స్త్రీ, తన భర్త మరణవార్త వినగానే దేహత్యాగం చేస్తుంది. సహగమనం చేయాల్సిన పని లేదు. సూర్యుణ్ణి విడిచి సూర్యకాంతి ఏ విధంగా మనలేదో అలాగే భర్తను విడిచి భార్య జీవించి ఉండలేదు. అందుచేత సహగమన వార్త నాకు ఆశ్చర్యం కలిగించలేదు" అని సమాధానమిచ్చింది. మహారాణికి అది విని చాలా కోపం వచ్చింది. తగిన సమయం వచ్చినప్పుడు ఆమె పతిభక్తిని పరీక్షించాలి అని భావించింది.

రాజుగారు జయదేవుడితో కలసి వేటకు వెళ్ళిన సమయంలో పద్మావతి, రాణిగారి అంతఃపురంలో ఉంది. వారిరువురూ మాటల్లో మునిగి ఉన్న సమయంలో, ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ఒక చెలికత్తె వచ్చి, "అమ్మా! మహారాణీ! రాజుగారు, కవిగారు వేటలో ఉన్న సమయంలో ఒక పులి వచ్చి మీద పడి కవిగారిని చంపివేసింది" అని చెప్పింది.

ఆ మాటలు చెవిన పడిన మరుక్షణమే పద్మావతి ప్రాణాలను విడిచింది. జరిగిన సంఘటనతో రాణిగారు నిశ్చేష్ట రాలైంది. వేట నుంచి తిరిగి వచ్చిన రాజుగారు తన భార్య అవివేకం వల్ల పద్మావతి ప్రాణాలు పోయిన సంగతి తెలుసుకుని ఎంతో బాధపడ్డాడు. క్షమించాల్సిందిగా జయదేవుణ్ణి దీనంగా వేడుకున్నాడు.

అప్పుడు జయదేవుడు, "ప్రభూ! ఇందులో ఎవరి తప్పు లేదు. అంతా విధి విలాసం. భగవంతుని నిర్ణయం" అని పలికి, మరణించిన తన అర్ధాంగి పద్మావతి చెంత కూర్చుని, తన ఇష్టదైవమైన శ్రీకృష్ణుణ్ణి మనసారా ప్రార్థించాడు. తన్మయంగా హరి గుణగానం చేయసాగాడు. ఆ భక్తుడి గానామృతానికీ, అనన్య మధురభక్తికీ కరిగిపోయిన మువ్వ గోపాలుడు పద్మావతి ప్రాణాలను తిరిగి అనుగ్రహించాడు. పద్మావతి పతిభక్తినీ, జయదేవుని శ్రీకృష్ణభక్తినీ తలచుకుని రాజు, రాణి, ప్రజలూ ఆశ్చర్యపోయారు.

ఇప్పపువ్వు, పాలు, పంచదార, తేనె, అమృతాల కన్నా తీయనైనవీ, కమ్మనైనవీ జయదేవుని అష్టపదులు. మధురభక్తితో భగవంతుడిని మురిపించి, మెప్పించిన గొప్పకవి, వాగ్గేయకారుడు అయిన జయదేవుడు చిరస్మరణీయుడు. ❖

మనస్సుకు ఇవ్వాల్సిన శిక్షణ

– స్వామి రంగనాథానంద

ఆధ్యాత్మిక స్వేచ్ఛను కోరుకునే వారికి మనస్సు పవిత్రమైనప్పుడు స్వేచ్ఛ అరచేతిలో పండులా అందుబాటులో ఉంటుంది. రజస్సు, తమస్సులు, కామ క్రోధ రూపంలో వ్యక్తమవుతాయి. వాటికి శిక్షణనిచ్చి సత్త్వంలోకి తీసుకు రావాలి. అయితే ఎవరికి వారే ఈ శిక్షణను ఇచ్చుకోవాలి. 'నేను సహాయం చేస్తాను. కానీ, నీ మనస్సుకు నీవే శిక్షణ నిచ్చుకో'అని పిల్లలకు తల్లితండ్రులు చెప్పాలి. ఈ శిక్షణ అన్ని చోట్లా, అన్ని వేళలా లోలోపల జరుగుతుండాలి. విచిత్రం ఏమిటంటే ఎవరూ ఈ శిక్షణ అవసరం అనుకోవడం లేదు. అందువల్ల మనస్సు ఎప్పుడూ ఇంద్రియ విషయ వాసనలతోనే మునిగి ఉంటుంది. ఆ శత్రువులను ఏ విధంగా ఎదుర్కోవాలో శ్రీకృష్ణుడు *(భగవద్గీత 3.40)* చెబుతున్నాడు.

ఇన్ద్రియాణిమనోబుద్ధిరస్యాధిష్ఠానముచ్యతే ।
ఏతైర్విమోహయత్యేషజ్ఞానమావృత్యదేహినమ్ ॥

ఏ కోట బలహీనంగా ఉంటే ఆ కోటపై దండెత్తాల్సిందిగా యుద్ధరంగంలో శత్రువులు చెబుతారు. అలాగే, మనలో ఉన్న ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి – ఇవన్నీ వ్యక్తి యొక్క ప్రముఖమైన నిర్మాణ కేంద్రాలు. అందువల్ల వాటిని ఎదుర్కోవలసిందిగా శ్రీకృష్ణుడు చెబుతున్నాడు.

'ఇంద్రియాణి మనః బుద్ధిః అస్య అధిష్ఠానమ్ ఉచ్యతే' – ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి – శరీరంలోని ముఖ్యమైన నిర్మాణాలు. సమాజంలో ఉన్న అవినీతి, దౌర్జన్యం మనస్సు నుంచి ఉత్పన్నమవుతున్నాయి. సరిగ్గా ఎక్కడ, ఏ ప్రదేశంలో ఈ శత్రువు స్థావరముంది? అంటే దానికి శ్రీకృష్ణుడు మూడు స్థావరాలు అని చెబుతూ, ముందు ఈ భౌతిక శరీరం. ఈ శరీరంలో ఇంద్రియ జ్ఞాన వ్యవస్థ ఉంది. అన్ని చెడులకూ ప్రధాన స్థావరం అది. రెండోది మనస్సు. సరైన జాగ్రత్త తీసుకోకుంటే కొద్దికాలంలోనే బుద్ధిని కూడా వ్యాధి ఆవరిస్తుంది. అప్పుడు మంచి చెడుల విచక్షణా జ్ఞానం నశిస్తుంది. బుద్ధి రోగపూరితం కాకుంటే మనల్ని రక్షిస్తుంది. అయితే, వ్యక్తిలో ఏ స్థావరంలో ఆ వ్యాధి ఉందో ముందు కనిపెట్టాలి.

'ఏతైః విమోహయతి ఏషః జ్ఞానమ్ అవృత్య దేహినమ్' – వ్యక్తి వికాసానికి దూరంగా ఈ మూడూ ఉంటాయి. అప్పుడే మాయ, మనిషిని ఆవరించి ఉంటుంది. సరిగ్గా ఆలోచిస్తున్నప్పుడు ఎవరూ ఏ తప్పులూ చేయరు. నువ్వు తప్పు చేశావంటే నిన్ను ఏదో ఆవరించిందనే అనుకోవాలి. 'కఠోపనిషత్తు' (మూడో అధ్యాయం, శ్లోకాలు 3 నుంచి 9)లో మానవుణ్ణి రథ రూపకల్పనతో పోల్చాడు. యముడు, నచికేతునితో 'జీవితం పరిపూర్ణతకు మార్గం అనీ, ప్రతి మానవుడూ ఆ ప్రయాణానికి కావలసినవి కలిగి ఉన్నాడనీ, అవే బండి, కళ్ళాలు, గుఱ్ఱాలు, బండి నడిపేవాడు కావాలనీ, అవన్నీ నీలో కూడా ఉన్నాయనీ, దానితో సుఖంగా ప్రయాణం చేయమనీ' చెప్పాడు.

వ్యాధి ఏ స్థానంలో ఉన్నా కూడా ప్రయాణం సరిగ్గా సాగదు. ప్రయాణం అనేది బుద్ధి అధీనంలోనే ఉండాలి. అంతేకానీ, ఇంద్రియాలు, మనస్సుల అధీనంలో ఉండకూడదు. మానవ దేహంలో అద్భుతమైన శక్తి ఉంది. ఆ శక్తిని నిరోధించి, శిక్షణనిచ్చి, వాటికి మార్గాన్ని చూపించాలి. దాని వల్ల గొప్ప శక్తి విలువైన రీతిలో ఉపయోగపడుతుంది. వరద ప్రవాహాన్ని నియంత్రించి, జలాశయాల నుంచి నీటిని పంటలకూ, విద్యుచ్ఛక్తికీ ఏ విధంగా వినియోగించుకోగలుగుతున్నామో, అదే విధంగా నీలోని శక్తిని నియంత్రించి నీవు జీవితంలో ఏది విలువైందిగా భావిస్తావో దానికి వినియోగించు. అలా చేయకుంటే అది ఇంద్రియ ప్రయాణమే అవుతుంది కానీ, నీ ప్రయాణం కాదు. అంటే నదీ ప్రవాహం వృథాగా సముద్రంలో కలిసిన రీతిగా అవుతుంది.

సామాజిక పరిణామంలో ఉన్నతమయిన విలువలనూ, శాంతినీ పెంచాలనుకున్నా, వ్యక్తిగత విలువలను పెంపొందించుకోవాలన్నా, మనస్సుని మంచి దారికి మళ్ళించే శిక్షణ ఇవ్వడం అవసరం. ❖

(స్వామి రంగనాథానందజీ 'గీతోపన్యాసాల' నుంచి)

సేకరణ: ఆర్. కృష్ణ

(...గత సంచిక తరువాయి)

కొన్ని విధులు, నిషేధాలు

తులసీ వన ప్రదేశం, ఆ పరిసర ప్రాంతం కూడా పవిత్రమైనవి. కాబట్టి, ఆ పరిసర ప్రదేశాలను పరిశుభ్రంగా, శుచిగా ఉంచాలి.

దేవుడి పూజకు తులసి ఎంతో ప్రశస్తమైనది. పూజార్చనల నిమిత్తం తులసీ దళాల్ని కోసేవారు తప్పనిసరిగా స్నాన

మాచరించి, శుచి అయిన తరువాతే కోయాలి. అదీ కుడి చేతితోనే కోయాలి. ప్రాతః కాలంలోనే ఆ పని చేయాలి. అయితే, ఎట్టి పరిస్థితుల్లోనూ గోళ్ళతో తులసి పత్రాలను తుంచ కూడదు. ఇక, తులసి సన్నిధానంలో విష్ణుమూర్తి ఏకాంతంగా ఉంటాడు కాబట్టి, సూర్యాస్తమయం తరువాత తులసిని అసలే కోయకూడదు. తులసి చెట్టుకు నిత్యం నీళ్ళు పోసి, పోషించే వారే తులసీ దళాల్ని కోయడానికి నైతికంగా అర్హులు.

ప్రార్థిస్తూనే కోయాలి!

తులసీ దళాలను కోసేటప్పుడు క్రింది శ్లోకాన్ని చెబుతూ నమస్కరించాలి.

మాత స్తులసి గోవింద హృదయానందకారిణి
నారాయణస్య పూజార్థం చినోమి త్వాం నమోస్తుతే ॥

'గోవిందునికి హృదయానందం కలిగించే తులసీ మాతా! నీకు నమస్సులు. నారాయణుని పూజ నిమిత్తం పత్రాలు తెంపుతున్నాను. నన్ను క్షమించి అనుగ్రహించు!'

అలాగే, తులసి చెట్టు నుంచి దళాలు కోస్తున్నప్పుడు చేసే ప్రార్థనగా ఈ క్రింది శ్లోకాలను కూడా చెబుతారు:

1. ***తులసీ! అమృత సంభూతే! సదా త్వమ్ కేశవప్రియే ।***
   కేశవార్థం లునామి త్వమ్ వరదా భవ శోభనే ॥
2. ***మోక్షైక హేతోర్ధరణి ప్రసూతే, విష్ణో స్సమస్తస్య గురోః ప్రియయే తే।***
   ఆరాధనార్థం పురుషోత్తమస్య, లునామి పత్రం తులసి క్షమస్వ ॥
3. ***ప్రసీద మమ దేవేశి ప్రసీద హరి వల్లభే ।***
   క్షీరోద మథనోద్భూతే తులసీ త్వమ్ ప్రసీద మే ॥

'అమృత సంభూతురాలైన ఓ తులసీ! నిత్యం కేశవునికి ప్రియమైనదానా! ఆ కేశవుని పూజ కోసం భక్తితో పత్రాలు తెంపుతున్నాను. నన్ను అనుగ్రహించు!'

'సర్వ మోక్షాలనూ ప్రసాదించడానికి ఈ భూమి మీద అవతరించిన ఓ తులసీ మాతా! విష్ణుమూర్తికి ప్రియమైన దానా! పురుషోత్తముని ఆరాధన నిమిత్తం నీ పవిత్రమైన పత్రాలు కోస్తున్నాను. క్షమించి, నన్ను అనుగ్రహించు!'

'ఓ దేవీ! నన్ను అనుగ్రహించు. శ్రీహరికి ప్రియమైన దానా! నన్ను అనుగ్రహించు. పాల సముద్రాన్ని మథించినప్పుడు పుట్టిన ఓ తులసీ! నన్ను అనుగ్రహించు!'

పై మూడు శ్లోకాలనూ పఠిస్తూ, తులసీ దళాలను కోయడం శ్రేయస్కరం.

తులసిని కోసే విధానం

తులసిని కోసేటప్పుడు విడి ఆకులనూ, కొమ్మలనూ కోయ రాదు. దళాలుగానే కోయాలి. దళాలను కోసేటప్పుడు మొక్క కదలకుండా రెండో చేతితో దళాలను కోసే చోట పట్టుకొని, నిదానంగా కోయాలి. గోటితో గిల్లకూడదు. కుడి చేతి చూపుడు వేలు, చిటికెన వేలు వదిలేసి, మిగిలిన మధ్య వేలు, ఉంగరపు వేలు, బొటనవేలు చేర్చి, దళాలను తుంచాలి. అలా తుంచు తున్నప్పుడు తులసీ ప్రార్థన తప్పకుండా చేయాలి.

సర్వసాధారణంగా దేవుణ్ణి ఎప్పటికప్పుడు తాజాగా కోసిన పుష్పాలు, పత్రాలతోనే పూజించాలి. అయితే, కోసినది మొదలు కొద్ది రోజుల వరకు తులసి, పూజకు పనికి వస్తుంది. మారేడు మూడేళ్ళు, తామరపూలు 7 రోజుల వరకు పూజకు పనికి వస్తాయి. ❖ (వచ్చే సంచికలో 'తులసి గురించి పురాణాల్లో')

With Best Compliments From
PENNAR INDUSTRIES LIMITED
305, Saptagiri Towers, Begumpet, Hyderabad - 500 016
పెన్నార్ కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

'వివేకానంద ప్రశస్తి' పురస్కార ప్రదానోత్సవం

స్వామి గౌతమానందజీ నుంచి పురస్కారాన్ని స్వీకరిస్తున్న శ్రీ రమణయ్య

చెన్నై శ్రీరామకృష్ణ మఠం సాంస్కృతిక, విద్య, సేవా, క్రీడా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ప్రతి ఏటా 'వివేకానంద ప్రశస్తి' పురస్కారంతో గౌరవించాలని నిర్ణయించింది. ప్రప్రథమంగా ఈ పురస్కారం 'స్వామి వివేకానందుల మానవతావాదం' అనే అంశంపై పరిశోధన చేసి మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాను సాధించిన శ్రీ ఆత్మకూరు రమణయ్యకు లభించింది.

2010 ఫిబ్రవరి 21వ తేదీన చెన్నై శ్రీరామకృష్ణ మఠంలో ఈ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. మఠం అధ్యక్షులు స్వామి గౌతమానందజీ ఈ పురస్కారం క్రింద 50 వేల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపికలతో శ్రీ రమణయ్యను సన్మానించారు.

చెన్నై శ్రీరామకృష్ణ మఠంలో కావలి ఉద్యోగంలో చేరిన శ్రీ రమణయ్య స్వయం కృషితో ఉన్నత విద్యను అభ్యసించారు. స్వామి వివేకానంద బోధనల స్ఫూర్తితో డాక్టరేట్ పట్టాను సాధించారు. ప్రస్తుతం ఆయన చెన్నై మఠ ప్రచురణల విభాగంలో ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా సేవలందిస్తున్నారు. ❖

యువజన సదస్సు

యువజన సదస్సులో పాల్గొన్న స్వామీజీలు, ప్రముఖ వక్తలు

విశాఖపట్నం రామకృష్ణ మిషన్ ఆశ్రమ ఆధ్వర్యంలో 2010 మార్చి 7వ తేదీన యువజన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి అమృతానందజీ; కడప రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి ఆత్మవిదానందజీ; స్వామి గరిమానందజీ, స్వామి గుణేశానందజీ, స్వామి నిత్యయోగానందజీ; విశాఖ రేంజ్ డి.ఐ.జి డాక్టర్ సౌమ్య మిశ్రా; ఆచార్య ఎ. ప్రసన్న కుమార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం; శ్రీ జి. వేంకట రెడ్డి, శ్రీ ఎమ్. సత్యనారాయణరాజు పాల్గొని యువతకు స్ఫూర్తిదాయక సందేశాన్నిచ్చారు. ప్రశ్నోత్తరాల సదస్సులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ❖ నివేదిక : అనిల్ కుమార్

పండుగలు - పర్వదినాలు

ఏప్రిల్ - 2010

10	శనివారం	:	ఏకాదశి
24	శనివారం	:	ఏకాదశి

మే - 2010

09	ఆదివారం	:	ఏకాదశి
18	మంగళవారం	:	ఆది శంకరాచార్య జయంతి
24	సోమవారం	:	ఏకాదశి
26	బుధవారం	:	నృసింహ జయంతి
27	గురువారం	:	భగవాన్ బుద్ధ జయంతి

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

1. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది కోర్సులకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) 'వేదచూడామణి' : ఋగ్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క అధ్యయనము

యోగ్యతలు : మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.

వయస్సు : 8 నుంచి 10 సంవత్సరాల మధ్య

స్టైఫండ్ : నెలకు రూ. 1,000/-

(ఆ) 'వేదార్థచూడామణి' : ఋగ్వేదము/ యజుర్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము

యోగ్యతలు : సంస్కృత పరిజ్ఞానముతో బాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.

వయస్సు : 15 సం॥, ఆ పైన

స్టైఫండ్ : నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) వేదాధ్యాపకుడు : (సామవేదము/ అథర్వవేదము - వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)

కావలిసిన అర్హతలు : క్రమాంతము లేక పదాంతము

అదనపు అర్హతలు : ఏదైన మఱియొక వేదము/ వేదభాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము

అనుభవము : 2 సంవత్సరములు

సంభావన : నెలకు రూ॥ 8,000/- మొత్తము, సౌకర్యములతో

(ఆ) వేదభాష్యాచార్యుడు : (ఒక్కొక్క వేదానికి ఒక్కొక్కరు చొప్పున 4 ఖాళీలు)

విద్యార్హత : ఏదైనా వేద భాష్యంలో ఉత్తీర్ణత

అదనపు అర్హత : మరొక వేద భాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము

అనుభవార్హత : 5 సం॥

సంభావన : నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన దరఖాస్తు ఫారములను **శ్రీ పి. వేంకటేశ్వర్లు గారు, మేనేజింగ్ డైరెక్టర్, కాకతీయ సిమెంట్, సుగర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్, 'గురుకృప' (ఆంధ్రా బ్యాంకు ఎదురుగా), 1 - 10 - 140/1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 500 020** (ఫోను: 040 - 27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టు ద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ఆ ముద్రిత దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్ని బట్టి ఖాళీలను పూరించుట లోనూ, అర్హతల సవరణ లోనూ మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

సం/-

హైదరాబాద్ కులప్రశాసకుడు

Sponsored by:

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1 - 10 - 140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad - 500 020
Ph: 2763 7717, 2763 3627, Fax No. 040-27630172, Email: info @ kakatiyacement.com

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

సుబోధ

భక్తుడు: ప్రార్థన వల్ల ఏదైనా ప్రయోజనం ఉంటుందా?

శ్రీరామకృష్ణులు : లేకేం! తప్పక ఉంది. ప్రార్థించేటప్పుడు మనస్సునూ, వాక్కునూ ఐక్యం చేస్తే భగవంతుడు అలాంటి ప్రార్థనను ఆలకించి సఫలం చేస్తాడు. ఊరక నోటితో "ప్రభూ! ఈ సకలం నీదే" అంటూ, అంతరంగంలో అన్నీ తనవే అని భావించే మానవుడి ప్రార్థనలు నిరర్థకాలు.

నీ మనోభావాల పట్ల ద్రోహివి కాబోకు. నిష్కపటిగా ఉండు; నీ మనోభావాలకు అనుగుణంగా వర్తించు. నిష్కపట హృదయంతో, వినిర్మల హృదయంతో ప్రార్థించు. అప్పుడు భగవంతుడు నీ ప్రార్థనను ఆలకించి తీరుతాడు.

నువ్వేమి సంకల్పిస్తావో దాన్నే పలుకు. వాక్కూ, సంకల్పమూ ఐక్యం కావాలి. ఇందుకు బదులు నోటితో భగవంతుడే నా సర్వస్వమని పలుకుతూ, హృదయంలో సంసారమే నా సర్వస్వమని భావిస్తూ చేసే ప్రార్థన వల్ల నీకు రవ్వంత ప్రయోజనమూ ఉండదు.

సార్వభౌముని దర్శించాలనుకొనేవాడు ముందుగా ద్వార పాలకులనూ, గద్దె వద్ద ఉండే అంగరక్షకులనూ అనుకూలురను చేసుకోవాలి. ముందుగా వారి దయ సంపాదించాలి. రాజరాజేశ్వరుడి సన్నిధిని చేరి అతడి అనుగ్రహాన్ని పొందాలనుకొన్నవాడు ఎన్నో భక్తి సాధనలు చెయ్యాలి, ఎందరో భక్తులను సేవించాలి. చిరకాలం సత్సాంగత్యం చెయ్యాలి.

లౌకిక చింతలూ, తాపత్రయమూ నీ మనస్సును కలవర పెట్టనివ్వకు. విధ్యుక్తకర్మలను సకాలంలో నిర్వర్తిస్తూ నీ మనస్సును మాత్రం సదా భగవంతుడి మీద లగ్నం చెయ్యి. ❖

('శ్రీరామకృష్ణ బోధామృతం' నుంచి)

శ్రీరామకృష్ణ ప్రభ,
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్-500 029
ఫోన్: 040-2766 7799, 2763 3936; E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: **స్వామి జ్ఞానదానంద**   సంపాదకులు: **స్వామి పరిజ్ఞేయానంద**

Vol.67- 4, Sri Ramakrishna Prabha (Telugu Monthly) April 2010, Regd. with the Registrar of Newspaper for India Under
No. 1120/57. Postal Registration No. HD-1071/2010-12. Licensed to Post Under WPP : CPMG/AP/HC-13/WPP/2010-12.

"Are you growing spiritually? Can you love others? Can you feel oneness with others? Have you peace within yourself? And do you radiate it around you? That is called spiritual growth, which is stimulated by meditation inwardly, and by work done in a spirit of service outwardly."

- Swami Ranganathananda



With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & పక్యాల గిరిజ, డైరక్టర్

SVIS LABS LIMITED

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex,Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net
Web Site : www.svisslabss.net

TÜV TÜV CERT DIN EN ISO 9001 : 2000 Certificate : 01 100 058568

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.